



సహకారంలో స్వాహారాయుడు

సహకార శాఖలో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఆ అధికారి అవినీతి, అక్రమాలకు అంతే లేదు. డిప్యూటీ రిజిస్ట్రారుగా ఎంపికైన తోట సాయినాథ్ మొదట మార్కాపురం డివిజన్ సహకారశాఖాధికారిగా పనిచేశారు. అక్కడి నుంచి ఫారిన్ సర్వీసు కింద తిరుపతి జిల్లా గూడూరు మునిసిపల్ కమిషనర్‌గా వెళ్లారు. ఏడాదిలోపే అక్కడ ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణలో అవన్నీ వాస్తవమని తేలడంతో సహకారశాఖకు తిరిగి సరెండర్ చేశారు. పోస్టింగ్ కోసం నాలుగు నెలలు వేచి ఉన్న ఆయన్ను గతేడాది డిసెంబరు 31న ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా (డీఎల్‌సీవో)గా నియమించారు. ఈ ఏడాది జనవరి 1న బాధ్యతలు స్వీకరించిన సాయినాథ్ తన ప్రతాపం చూపించసాగారు. కార్యాలయంలోని కొందరు సిబ్బందిని వెంటబెట్టుకొని సొసైటీలపై దాడులకు శ్రీకారం చుట్టారు. వసూళ్ల పర్వం సాగించారు. మహిళా ఉద్యోగులను వేధించారు. ఓ బాధితురాలి ఫిర్యాదుతో ఆయనపై బదిలీ వేటు పడింది. అదేసమయంలో సాయినాథ్ అక్రమాలపై కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించారు.

సిబ్బందిని బెదిరించి భారీగా వసూలు

- జిల్లాలో పనిచేసింది కేవలం 45 రోజులే
- ఆ కొద్దికాలంలోనే అనేక ఆరోపణలు
- తనిఖీల పేరుతో సొసైటీలపై దాడులు
- మహిళా ఉద్యోగులపై అసభ్య ప్రవర్తన
- బాధిత ఉద్యోగి ఫిర్యాదుతో బదిలీ వేటు
- సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 27 : తోట సాయినాథ్.. ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పనిచేసింది స్వల్ప కాలమే. అయితే ఆ సమయంలోనే భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఓ ఫిర్యాదు నేపథ్యంలో బదిలీ వేటుపడిన సదరు అధికారి వ్యవహారంపై కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారులుగా జిల్లా సహకారాధికారి పి.రాజశేఖర్, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చనలను నియమించారు. డీఎల్‌సీవో సాయినాథ్, మరో ఐదుగురు సభ్యుల బృందం సొసైటీలలో తనిఖీల పేరుతో సాగించిన అకృత్యాలు, కేవలం డబ్బుల కోసం వారు చేసిన దుశ్చర్యలపై విచారించి రెండు వారాల్లో నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. సొసైటీలో ఒక మహిళా ఉద్యోగి పట్ల ఆ అధికారి, ఆయన బృందం అసభ్య ప్రవర్తనపై కూడా విచారణ నిర్వహించమన్నారు. మరోవైపు ఇప్పటికే సాయినాథ్‌పై సహకార శాఖ కమిషనర్ కార్యాలయానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన అవినీతి, అక్రమాలపై సహకార శాఖ కమిషనర్ డీసీవోను నివేదిక కోరారు. వేధింపులకు గురైన మహిళా ఉద్యోగి కూడా సహకారశాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శికి, సీఎంవోకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆ అవినీతి అధికారిపై బదిలీ వేటు వేశారు. ఆయన రాజమండ్రిలోని సహకార శిక్షణ కళాశాలకు బదిలీ అయి అక్కడ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సహకార శాఖ చరిత్రలో ఒంగోలు డివిజన్‌లో కేవలం 45 రోజుల వ్యవధిలోనే అనేక అవినీతి, అక్రమాలతో బదిలీ అయిన అధికారి ఈయనే.

తనిఖీల పేరుతో ఇష్టారాజ్యం

సొసైటీల తనిఖీ పేరుతో సాయినాథ్, ఆయన బృందం ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. సొసైటీలకు వెళ్లి రికార్డులు పరిశీలించి ఏదైనా చిన్న తప్పు దొరికినా దానిని సాకుగా చూపి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్యంగా తిట్టారు. ఇందుకు ఒక సొసైటీలో జరిగిన ఉదంతాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సాయినాథ్, ఆయన బృందం తనిఖీకి వెళ్లిన సమయంలో ఒక సొసైటీ సీఈవో అన్ని రికార్డులు చూపించారు. తీర్మానాల పుస్తకం మాత్రం సొసైటీ అధ్యక్షుడి సంతకం చేయించేందుకు ఇంటి వద్ద ఉంచారు. అయితే ఆ పుస్తకం చూపించమంటూ ఆ సీఈవోను ఒక ఖైదీలా తమ వాహనంలో ఎక్కించుకుని ఆయన ఇంటికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో పెద్దపెద్దగా రంకెలు వేస్తూ అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో ఆ వీధిలోని వారంతా గుమిగూడగా కుటుంబ సభ్యులు రోదించారు. ఆ అవమానం తట్టుకోలేని సదరు సీఈవో ఆత్మహత్యకు సిద్ధపడగా అందరూ వారించి నచ్చజెప్పడంతో వెనక్కి తగ్గారు. సొసైటీల రికార్డులను బలవంతంగా సీజ్ చేసి కార్యాలయానికి తెచ్చి బేరసారాలకు తెరలేపారు. మరోవైపు సొసైటీలో తప్పులు జరిగాయని, విచారణకు సిఫార్సు చేస్తే ఇరుక్కుపోతారని పీఏసీఎస్‌ల సిబ్బందిని బెదిరించి బలవంతంగా భారీమొత్తంలో వసూలు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. సొసైటీల రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు కనీసం రసీదులు కూడా ఇవ్వకుండా బలవంతంగా వాటిని ఎత్తుకుపోవడంతో అవి ఏమవుతాయోనని సిబ్బంది ఆందోళన చెందారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని కొత్తపట్నం, చిమట, దొడ్డవరం, పసుపుగల్లు, ఉమామహేశ్వరపురం, బొప్పూడివారిపాలెం, కూనంనేనివారిపాలెం, చీమకుర్తితోపాటు మరో ఎనిమిది సొసైటీలను సాయినాథ్, ఆయన బృందం తనిఖీ చేశారు. అడిగినంత ఇస్తేనే రికార్డులు ఇస్తామంటూ లక్షలాది రూపాయలను బలవంతంగా వసూలు చేశారు. పీడీసీసీ బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది కొందరిపైన కూడా సాయినాథ్ ప్రతాపం చూపించారు. దీంతో బ్యాంకు సీఈవో కోటిరెడ్డి ఆయనపై డీసీవోకు ఫిర్యాదు చేశారు. కొన్ని సొసైటీల అధ్యక్షులు కూడా సాయినాథ్‌పై డీసీవోకు, సహకార శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు,

కమిషనర్‌కు బాధితురాలు ఫిర్యాదు

ముండ్లమూరు మండలంలోని ఓ సొసైటీ సందర్శన సందర్భంగా అక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల డీఎల్‌సీవో సాయినాథ్ అసభ్యకరంగా ప్రవర్తించారు. ద్వంద అర్థాలతో మాట్లాడుతూ ఆమెను ఇబ్బందిపెట్టారు. ఆమె వారించబోతే మరింతగా రెచ్చిపోయారు. సొసైటీ తనిఖీ పేరుతో రికార్డులతోపాటు ఆ ఉద్యోగిని సర్వీసు రిజిస్టరు తెచ్చి ఇబ్బందిపెట్టారు. నీ సంగతి నాకు తెలుసంటూ సెటైర్లు వేస్తూ అవమానించారు. ఎస్‌ఆర్ కోసం ఒంగోలులోని కార్యాలయానికి వస్తే ఆ అధికారి బృందంలోని సిబ్బంది ఒకరు అక్కడ కూడా ఆమెను వదలకుండా వేధింపులకు గురిచేశారు. వీటిని తట్టుకోలేకపోయిన ఆమె సహకార శాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శికి ఈనెల 15న ఫిర్యాదు చేశారు. అదేరోజు సాయినాథ్‌పై బదిలీ వేటు వేస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు.

కలెక్టర్ ఆగ్రహం.. విచారణకు ఆదేశం

ఒంగోలు డివిజనల్ సహకారశాఖాధికారి సాయినాథ్ తీరు, ఆయన నిర్వాకాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ సీరియస్ అయ్యారు. ఆయన తనిఖీల పేరుతో నిర్వహించిన దందాలు, అక్రమ వసూళ్లపై మండిపడ్డారు. ఇంతగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిని కేవలం బదిలీతోనే సరిపెట్టడం సరికాదని, తప్పు చేసిన వారిని తప్పనిసరిగా శిక్షించాలని సాయినాథ్, ఆయన బృందంపై కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. అయితే సాయినాథ్ మాతృశాఖలో మాత్రం చలనం లేదు. అనేక ఫిర్యాదులు నేరుగా ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అందినా, డీసీవో ప్రాథమిక నివేదిక సమర్పించినా పట్టించుకోలేదు. ఇన్ని తప్పులు చేసిన అధికారిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. సహకారశాఖలో ఆ అధికారికి ఉన్న పలుకుబడి, ఉన్నతాధికారులతో ఉన్న సాన్నిహిత్యం అయనకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని ఆశాఖ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. కాగా ఈ విషయమై డీసీవో పి.రాజశేఖర్‌ను వివరణ కోరగా డీఎల్‌సీవో తోట సాయినాథ్ అక్రమాలపై కలెక్టర్ విచారణకు ఆదేశించిన మాట వాస్తమేనన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం

- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్
- అశోక్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలి
- గిద్దలూరులో ముస్లింల ఆత్మీయ సమావేశం
- భారీగా హాజరైన మైనారిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, పక్కన టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. మంగళవారం గిద్దలూరులోని షాదీఖానాలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి షరీఫ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చి వారికి అన్ని విధాలా అండగా నిలిచిన నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. నేడు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని మరచి వారిపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నదని విమర్శించారు. ముస్లింలపై వైసీపీ మూకలు దాడి చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ముస్లింలు సిద్ధంగా ఉండాలన్నారు. టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మౌలానిముస్తక్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జేపీడీ ప్రభుత్వం నడుస్తోందన్నారు. జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని ముస్లింలకు విజ్ఞప్తి చేశారు. ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను శాసనసభ్యుడిగా ఉన్న కాలంలో ముస్లింల సంక్షేమానికి కృషిచేశానన్నారు. అప్పట్లో షాదీఖానాల నిర్మాణానికి నిధులు కేటాయించామని తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లింలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా బలపరచిన తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాన్వావలి, ముస్లిం నాయకులు పెద్దబాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై వేటు...!

- మెప్మాలో ఇద్దరు సీవోలు, ఐదుగురు ఆర్పీలు ఉద్యోగాల నుంచి తొలగింపు
- పలువురికి మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపులు సృష్టించి భారీగా రుణ దోపిడీకి పాల్పడిన పలువురు అధికారులపై వేటు పడింది. ఇద్దరు సీవోలు, ఐదుగురు ఆర్పీలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ మెప్మా మిషన్ ఎండీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. మరికొందరికి చార్జిమెమోలు ఇచ్చారు. పట్టణ పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు రుణాలు అందించగా.. కొందరు ఆర్పీలు, సీవోలు అధికారపార్టీ నేతలతో కలిసి నకిలీ గ్రూపులను సృష్టించి భారీగా దోచుకున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ బాగోతంపై వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ, సివిల్ సప్లయీస్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్లు గత వారం ఆర్పీలు, సీవోలు, ఇతర సిబ్బందిని విచారించారు. దీంతోపాటుగా పలు బ్యాంకుల్లో విచారణ చేసి ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. అదేసమయంలో పీడీ కూడా నివేదికను మెప్మా ఎండీకి పంపారు. దీనిపై ఆమె సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంలో భాగస్వాములైన మరో ఇద్దరు సీవోలు చాంద్‌బీ, నిర్మల, ఆర్పీలు ఏవీసుజాత, సలోమి, పిసుజాత, ఝాన్సీరాణి, వాసవిలను ఉద్యోగం నుంచి తొలగించారు. సీఎంఎం, ఐదుగురు సీవోలకు మెమోలు జారీ చేశారు. ఇదిలా ఉండగా పీడీ టి.రవికుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇప్పటివరకూ ప్రాథమిక విచారణలో పలువురిను గుర్తించి విధుల నుంచి తొలగించగా, కొందరికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, అయితే ఇప్పటికే అవినీతికి పాల్పడిన కొందరు ఆర్పీలు బోగస్ గ్రూపుల పేరుతో పొందిన రుణాలను తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. త్వరలోనే పూర్తి నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మికి అందజేస్తామని తెలిపారు.



చట్లమిట్ల సచివాలయం వద్ద శిలాఫలకాన్ని పగులగొడుతున్న రేగుమానిపల్లి సర్పంచ్ రామాంజనేయరెడ్డి

శిలాఫలకం ధ్వంసం

- ప్రొటోకాల్ పాటించలేదని వైసీపీ సర్పంచ్ ఆగ్రహం

పెద్దారవీడు (మార్కాపురం రూరల్), ఫిబ్రవరి 27: సచివాలయ భవనం శిలాఫలకంలో తన పేరు లేదని వైసీపీకి చెందిన సర్పంచ్ దానిని ధ్వంసం చేశారు. ఈ ఘటన పెద్దారవీడు మండలం చట్లమిట్లలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలో నూతన సచివాలయాన్ని నిర్మించారు. దీన్ని ఎన్నికల కోడ్ వచ్చే లోపు ప్రారంభించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ సచివాలయం గోడపై శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ సచివాలయం పరిధిలో చట్లమిట్లతోపాటు రేగుమానిపల్లి పంచాయతీ కూడా ఉంటుంది. అయితే అధికారులు మాత్రం దానిపై చట్లమిట్ల పాలకవర్గం పేర్లు మాత్రమే వేశారు. రేగుమానిపల్లి సర్పంచ్, పాలకవర్గం పేర్లు రాయలేదు. దీంతో ఆగ్రహించిన రేగుమానుపల్లి సర్పంచ్ రామాంజనేయరెడ్డి ఆ సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాన్ని సుత్తితో ధ్వంసం చేశారు. సచివాలయ పరిధిలోని రెండు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, వార్డుసభ్యుల పేర్లను రాయకుండా కేవలం చట్లమిట్లకే పరిమితం చేయడం ఏమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించి రెండు గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మద్దిపాడులో పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లును రాచర్లకు, ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.డానియేలును వెలిగండ్లకు బదిలీ చేశారు. హనుమంతునిపాడులో పనిచేస్తున్న ఎన్.రమాదేవిని ఒంగోలు ఆర్డీవో కార్యాలయ కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్‌గా, ఆర్డీవో కార్యాలయ కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.అనురాధను మద్దిపాడు తహసీల్దార్‌గా నియమించారు.

వేడెక్కిన రాజకీయం

- తాడేపల్లి సమావేశానికి మహీధర్, మద్దిశెట్టి గైర్హాజరు
- ఆమంచికి ఆహ్వానమే లేదు!
- 29న మాగుంట రాజీనామా
- కందుకూరుకు బుర్రా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు పలువురు ప్రముఖులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పార్టీ దూరంగా పెట్టిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీలో చేరేందుకు రెడీ అయ్యారు. తాజాగా దర్శి, కందుకూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, మానుగుంట మహీధర్‌రెడ్డి వైసీపీకి దూరమయ్యారు. ఇంకోవైపు కొత్తగా ఆ పార్టీ రంగంలోకి దింపుతున్న అభ్యర్థులు ఒక్కొక్కరు జారిపోతున్నారు. కందుకూరు నుంచి రంగంలో దించాలని భావించిన అరవిందయాదవ్ పోటీకి విముఖత చూపడంతో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను వైసీపీ రంగంలోకి తెచ్చింది. ఆ మేరకు తాడేపల్లిలో మంగళవారం సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరో ఒకరిద్దరు ఇన్‌చార్జిల మార్పు జరగవచ్చన్న ఊహాగానాలు వైసీపీ నేతల్లో ప్రారంభం కాగా అందుకు ఏమాత్రం అవకాశం లేదన్న సంకేతాన్ని అధిష్ఠానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల ఎంపికలో దూకుడును ప్రదర్శించిన వైసీపీకి మొదటి నుంచి ఎదురవుతున్న సమస్యలు ముదురుపాకానపడుతున్నాయి. మంగళవారం తాడేపల్లిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్లతో జగన్ సమావేశం నిర్వహించారు. అందులో ఆయన పోటీలో ఉన్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. అయితే సమావేశానికి ఎమ్మెల్యేలు వేణుగోపాల్, మహీధర్‌రెడ్డి హాజరుకాలేదు. సమావేశంలో ప్రస్తుతం ప్రకటించిన ఇన్‌చార్జిలే కాబోయే అభ్యర్థులని స్పష్టం చేసిన జగన్ అందుకు కొద్ది సమయం ముందే కందుకూరు ఇన్‌చార్జిని మార్పుచేశారు. దీంతో మరో ఒకటి అరా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉండవచ్చన్న ప్రచారం ప్రారంభమైంది.

మహీధర్, వేణుగోపాల్ దూరమైనట్లే

దర్శి, కందుకూరు ఎమ్మెల్యేలు వేణుగోపాల్, మహీధర్‌రెడ్డి కూడా వైసీపీకి దూరమైనట్లే భావిస్తున్నారు. ఒంగోలుకు సీఎం వచ్చిన రోజు కూడా మద్దిశెట్టి హాజరుకాలేదు. మంగళవారం తాడేపల్లి సమావేశానికీ గైర్హాజరయ్యారు. ఇటీవల ఆయన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఏదైనా పార్టీలో చేరతారా? ఎక్కడి నుంచైనా పోటీకి రంగంలోకి వస్తారా? అనేది ఖరారు కానప్పటికీ దర్శిలో వైసీపీ అభ్యర్థికి సహకరించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి కూడా మంగళవారం తాడేపల్లి సమావేశానికి వెళ్లలేదు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి పంపిన ప్రచార సామగ్రిని కూడా ఆయన తీసుకోకుండా వెనక్కు పంపించారు. తన భవిష్యత్తు రాజకీయ వ్యవహారంపై మహీధర్ గుంభనంగా వ్యవహరిస్తున్నప్పటికీ వైసీపీకి సహకరించబోరని తేటతెల్లమవుతోంది.

29న మాగుంట రాజీనామా

ఒంగోలు ఎంపీ మాగుంట ఈనెల 29వతేదీ వైసీపీకి రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. కొంతకాలంగా జగన్ ఆయన్ను దూరంగా పెట్టడం, ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా చెవిరెడ్డిని అందరికీ పరిచయం చేయడం, పార్టీ కార్యక్రమాలకు మాగుంటను ఆహ్వానించకపోవడం తెలిసిందే. దీంతో మాగుంట తర్జనభర్జనల అనంతరం ప్రత్యామ్నాయం వైపు దృష్టిసారించారు. టీడీపీ అధిష్ఠానం ఆయనకు స్నేహహస్తం అందించింది. మంగళవారం ఒంగోలు వచ్చిన మాగుంట తన కార్యాలయంలో కుమారుడు రాఘవరెడ్డి నిర్వహిస్తున్న ప్రత్యేక హోమాలు, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యమధ్యలో అనుచరులతో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం వరకు ఈ ప్రత్యేక హోమాలు జరుగుతాయి. ఎన్నికల సమయం దగ్గరపడటం.. టీడీపీ, జనసేన కూటమి నుంచి ఒత్తిడి పెరగటంతో అనుచరుల సూచన మేరకు ఆయన వైసీపీకి గుడ్‌బై చెప్పాలన్న నిర్ణయానికి వచ్చేశారు. గురువారం ఆయన అధికారికంగా వైసీపీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. శనివారం నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డితోపాటు మరికొందరు టీడీపీలో చేరనున్నారు. అదేరోజే మాగుంట టీడీపీ తీర్థం పుచ్చుకునే విషయమై స్పష్టత రాలేదు. అయితే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమాలకు జిల్లాకు రానున్నారు. వాస్తవానికి ఆయన శుక్రవారమే జిల్లాకు రావాల్సి ఉంది. అయితే మాగుంట చేరిక అనంతరం రావాలన్న ఉద్దేశంతో 3వ తేదీ తర్వాత జిల్లాకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈలోపు మాగుంట కుటుంబం, ఒంగోలు లోక్‌సభ పరిధిలోని తమ అనుచరులు తెలుగుదేశంలో చేరే ప్రక్రియ పూర్తికావచ్చని భావిస్తున్నారు.



ఒంగోలులో అనుచరులతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఇన్‌చార్జిలే ఫైనల్

తాడేపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ ఇప్పటివరకూ ప్రకటించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలను మార్పు చేసిన నియోజకవర్గాల్లో మళ్లీ మార్పులు ఉంటాయని ఆశించవద్దని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఒకట్రెండు చోట్లనే అలాంటి అవకాశం ఉందని తేల్చిచెప్పారు. తదనుగుణంగానే కందుకూరు మార్పు జరిగినందున పర్చూరు ఇన్‌చార్జి విషయంపై అనుమానాలు పెరిగాయి. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను మార్చి అక్కడ బాలాజీని నియమించారు. చీరాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆమంచి రంగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఒకట్రెండు మార్పులు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్న అనుమానాలు వైసీపీ నేతల్లో వినిపిస్తున్నాయి.



3 వరకు కలెక్టర్ సెలవు

- ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం నుంచి మార్చి 3వతేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన వ్యక్తిగత పనుల కోసం సెలవుపై తన స్వస్థలానికి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇన్‌చార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వ్యవహరించనున్నారు. వచ్చేనెల 4న కలెక్టర్ దినేష్‌కుమార్ తిరిగి విధుల్లో చేరనున్నారు.

కనిగిరి, మార్కాపురం మున్సిపల్ కమిషనర్లు బదిలీ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : జిల్లాలోని ఇద్దరు మునిసిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు కార్పొరేషన్, మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో మార్కాపురం, కనిగిరి కమిషర్లు ఉన్నారు. మార్కాపురంలో పనిచేస్తున్న వి.రవీంద్రను ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. తిరుపతిలో ఆడిట్ శాఖలో అసిస్టెంట్ అధికారిగా పనిచేస్తున్న ఈ.కిరణ్‌ను డిప్యుటేషన్‌పై మార్కాపురం కమిషనర్‌గా నియమించారు. కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న డానియేల్ జోసఫ్‌ను ప్రొద్దుటూరు రెవెన్యూ అధికారిగా బదిలీ చేశారు. గతంలో ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులై, వివిధ కారణాల చేత ఆగిపోయిన టీవీ రంగారావును కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు.

రాష్ట్రం బాగుండాలంటే
బాబు సీఎం కావాలి : దామచర్ల


ఇంటింటి ప్రచారం చేస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 27: రాష్ట్రం బాగుండాలన్నా, నిరుద్యోగులకు జాబు రావాలన్నా, బాబు సీఎం కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం నగరంలోని 3వ డివిజన్ బలరాంకాలనీ, భరత్‌కాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో అంశాలను వివరించడంతోపాటు, ఈ నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, సైకోపాలన అరాచకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలు దామచర్లకు ఘన స్వాగతం పలికారు. కార్యకరమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కపిల్ బాషా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27: ఒంగోలులోని రెండు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ప్రారంభమైన ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా జరిగింది. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ యాక్షన్ ఇండియా సంస్థలో ఈ పరీక్ష జరిగింది. ఈ రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 380 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. ఒక పరీక్షా కేంద్రంలో కావలి నుంచి వచ్చిన ఇరువురు మహిళా అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని కంప్యూటర్ పరీక్షకు అనుమతించలేదు. మధ్యాహ్నం సెషన్‌లో ఈ రెండు కేంద్రాల్లో 390మందికి 81 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 123 మంది అభ్యర్థులు హాజరుకాలేదు.

టెట్ సెల్ ఏర్పాటు: ఏపీ టెట్ పరీక్షకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా టెట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జిగా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ వ్యవహరిస్తారు. ఈ బృందంలో డీసీఈబీ కార్యదర్శి వై వెంకట్రావు, సూపరింటెండెంట్ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు, ఎంఎస్.కృష్ణకుమార్ ఉన్నారు. టెట్‌కు సంబంధించి సమస్యలు వస్తే సెల్‌ను సంప్రదించాలని కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు


ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27 : ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో 612 మంది విద్యార్థినులు పాల్గొనగా వారిలో 243 మంది వివిధ సంస్థల్లో అర్హత పొందారు. ప్రముఖ 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ముందుగా విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంతకు ముందు జరిగిన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వి.మోహన్, జేకేసీ కో ఆర్డినేటర్ ఏవీ.రాజ్యలక్ష్మి, జేకేసీ మెంటార్ సురేష్‌కుమార్, శ్రీనివాస్ ఆచారి, బాషా, వైపీ.రమేష్, ఎం.శ్రీను, అనూష తదితరులు పాల్గొన్నారు.

పంపుసెట్ల వినియోగంలో
రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి27: పంపుసెట్ల వినియోగంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ కోరారు. మంగళవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునికీకరణలో భాగంగా రైతులు సోలార్ విద్యుత్‌ను వినియోగించాలని, అందుకు సబ్సిడీ దొరుకుతుందని చెప్పారు. ముఖ్యంగా పంపుసెట్లు వినియోగంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలను పాటించాలని ఆయన సూచించారు. పంపుసెట్లును ప్రతి ఆరు నెలలకు ఒకసారి మరమ్మతు చేయించాలని, అందుకు సంబంధించిన ఎర్త్ వైర్లు సరిచూసుకోవాలని పేర్కొన్నారు. చీకట్లో పంపుసెట్లు ఆన్ చేయకూడదని, అలాగే తడిచేతులతో తాకకూడదని హితవు పలికారు. సమావేశంలో ఈఈ పి.శ్రీనివాస్, డీఈ టి.హైమావతి, చంద్రమోహన్, నాగేంద్ర పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రవల్లిక

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే- కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తదాగత్ బోధి ధర్మ షిటోరియా కరాటే ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ విద్యార్థులు ఏడు బంగారు పతకాలు, ఐదు వెండి పతకాలు కాటాస్ విభాగాల్లో సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాల రాగ(ఉమెన్ ఎంపవర్‌మెంట్) చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక పతకాలు సాధించిన డి.విహాస్, ఎస్‌డీ.ఆఫ్రిది, ఎస్‌కే .అబ్దుల్‌రజాక్, జి.హేమంత్, మోక్షిత సాయి, ఆశ్రిత్ సాయిరాం బంగారు పతకాలు, ఎస్.శ్రీనిక, వి.మోక్షిత, అభినాష్ ప్రయాంస్, భాను ప్రతీక్, యువరాజ్‌లు వెండి పతకాలు సాధించగా వారిని అభినందించారు. విద్యార్థులు పతకాలు సాధించేందుకు పాటుపడిన కరాటే మాస్టర్ డి. వెంకటేష్‌ను అభినందించారు.

డ్వామా పీడీ శీనారెడ్డి బదిలీ

● ఇన్‌చార్జిగా నిర్మలాదేవి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ కె.శీనారెడ్డిని మాతృశాఖకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సహకారశాఖలో పనిచేస్తున్న శీనారెడ్డి గత నాలుగున్నరేళ్లుగా డిప్యుటేషన్‌పై ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్ళకు పైబడిన అధికారులను బదిలీలు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో శీనారెడ్డిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శీనారెడ్డిని మాతృశాఖకు బదిలీ చేయడంతో పాటు ఇన్‌చార్జి పీడీగా మార్కాపురం పీఈడీగా పనిచేస్తున్న నిర్మలాదేవిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

4నుంచి డ్వామా ఉద్యోగుల ఆందోళన బాట

3న యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ● సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ● ఇప్పటికే నోటీసులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కనున్నారు. అందుకోసం రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా జిల్లాల్లో ఉద్యమం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, డ్వామా పీడీలకు సమ్మె నోటీసులను కూడా అందజేశారు. సమ్మె నోటీసులు ఇచ్చిన యూనియన్ నాయకులు వచ్చేనెల 3వతేదీలోపు రాష్ట్రస్థాయిలో జేఏసీ సమావేశం నిర్వహించి 4వతేదీ నుంచి విధులను బహిష్కరించి ఆందోళన బాటపట్టనున్నారు. ఉపాధి హామీ పథకంలో 2006 సంవత్సరంలో డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం రాత పరీక్ష , నైపుణ్యత పరీక్ష ద్వారా ఉద్యోగులను నియమించారు. అయితే ఆనాటి నుంచి వరకు క్షేత్ర స్థాయిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించుకున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గ్రేడ్స్ ఫిక్స్ చేసే విషయంలో గత పదేళ్ళ నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయి. పీఆర్సీ అమలు చేయడంతో పాటు పలు రకాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు వందలాది మంది రోడ్డుమీదకు వచ్చేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు. ప్రభుత్వం ఈ నాలుగు రోజుల్లో సమస్యలను పరిష్కరించని పక్షంలో సోమవారం నుంచి ఉద్యమాన్ని చేపట్టడం ద్వారా క్షేత్ర స్థాయిలో జరిగే ఉపాధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదు !

దామచర్లపై జగన్ పత్రికలో అసత్యకథనాలు ప్రచురించడంపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం ● ప్రతులను దహనం చేసిన జనసేన నాయకులు



జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : జగన్ దినపత్రికలో తమ నాయకుడు దామచర్ల జనార్దన్‌పై అసత్య కథనాలు రాయడంపై తెలుగు తమ్ముళ్ళు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయం ముందు జగన్ పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో వైసీపీ తన కరపత్రిక ద్వారా తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని, ఇది జీర్ణించుకోలేని జగన్ పత్రిక తన ఇష్టమొచ్చినట్లు రాస్తే ప్రజలు నమ్మరని చెప్పారు. మరోసారి తప్పుడు కథనాలు రాస్తే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తిప్పరమల్లి రవితేజ, నల్లమోతు రమేష్, ఉమర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జనసేన నిరసన

ఒంగోలు(కలెక్టరేట్): జనసేన పార్టీ, నాయకులపై తప్పుడు వార్తలు రాస్తే జగన్ పత్రిక కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆ పార్టీ నాయకులు హెచ్చరించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌పై తప్పుడు వార్త ప్రచురించడంతో మంగళవారం సాయంత్రం ఒంగోలులోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ జడా బాలనాగేంద్రయాదవ్ మాటాడుతూ ప్రతిపక్షాలపై తప్పుడు రాతలురాస్తూ బురదజల్లడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. రియాజ్ పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో నడిచిన వ్యక్తి అని, అధినేత తీసుకునే నిర్ణయాలు తమకు శిరోధార్యమన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా దామచర్ల జనార్దన్ విజయానికి కృషి చేస్తామన్నారు. ఇటువంటి తప్పుడు వార్తలు రాసే విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శి చనపతి రాంబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమన్నారు. ఇటువంటి తప్పుడు వార్తలు మానుకోకపోతే జగన్ పత్రిక కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, పిల్లి రాజేష్, వల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో భారీ అక్రమాలు

రూ.21.43 లక్షలు దుర్వినియోగం

ప్రజావేదికలో వెల్లడి

ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి నిర్ణయం


వివరాలను సేకరిస్తున్న పీడీ శీనారెడ్డి, డీవీవో ఝాన్సీ, ఏపీడీ వెంకటస్వామి

టంగుటూరు, ఫిబ్రవరి 27: టంగుటూరు మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల పనిచేయకుండానే చేసినట్లు చూపి నిధులు బొక్కేశారు. మరికొన్ని చోట్ల నాటినట్లు చూపిన మొక్కల ఆనవాళ్లు కన్పించలేదు. దీంతోపాటు ఇతరత్రా పలు పనుల్లో కలిపి రూ.21.43లక్షలు దుర్వినియోగం అయ్యాయి. ఈ మేరకు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో వివరాలను అధికారులు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.5.70కోట్ల మేర పనులు చేశారు. అయితే నాటిన మొక్కలు అడ్రస్ లేకుండా పోయినందుకు రూ.12లక్షలు, పనిచేయకుండానే చేసినట్లు చూపిన కారణంగా రూ.8లక్షలు. ఇతరత్రా రూ.1.20 లక్షలు 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రికవరీ చేయాలని నిర్ణయించారు. అవకతవకలకు సంబంధించి గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి మరో రూ.23,578 వసూలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అభియోగాలపై పూర్తి ఆధారాలు సేకరించాక రికవరీ నగదు తగ్గే అవకాశం ఉంది. మండలంలో జరిగిన అత్యధిక పనులకు ఈసీ చెక్‌మెజర్‌మెంట్ చేయలేదని గుర్తించారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత అధికారుల సంతకాలు లేకుండానే కూలి చెల్లింపు జరిగింది. అయితే సామాజిక తనిఖీ బృందాలు నీరున్న చెరువుల్లో కొలతలు తీసుకొని వ్యత్యాసాలు చూపినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ప్రజావేదికను చకచకా నడిపించారు. ఒక్కో గ్రామానికి 5నిమిషాలు మాత్రమే కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజావేదిక మమ అనిపించారని చెప్పవచ్చు. కార్యక్రమంలో డ్వామా పీడీ శీనారెడ్డి, విజిలెన్స్ విభాగం జిల్లా అధికారి ఝాన్సీ, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీపీ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు జీవన దర్పణం 'పడమటి గాలి'

● ప్రేక్షకులను ఆకట్టుకున్న నాటకం



నాటకాన్ని తిలకిస్తున్న ప్రేక్షకులు, నాటకంలోని ఓ సన్నివేశం

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 27: రైతుల జీవితం, వారు అనుభవించే కష్టాలు, ప్రకృతి వైపరిత్యాల ప్రభావం, రైతు బిడ్డల విదేశీ మోజు మొదలైనవి ప్రధాన అంశాలుగా ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు రచించిన పడమిటి గాలి నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ నాటకం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం రాత్రి ఒంగోలులోని హైదరీక్లబ్ ఆవరణలో నాటక ప్రదర్శన జరిగింది. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా నాటకంలో ఏర్పాటు చేసిన దృశ్యాలు, సంభాషణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తరతరాలుగా వస్తున్న భూమి మీద మక్కువ వదులుకోలేక, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వ్యవసాయాన్నే నమ్ముకుని జీవించే పెద్దతరం, విలాస జీవితంపై మోజుతో భూమిని అమ్మాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేసే యువతరం మధ్య సంఘర్షణలు సహజ సిద్ధంగా ఉండి ప్రేక్షకులను మైమరపించాయి. విశ్రాంత ఐఏఎస్ అధికారి జి.బలరామయ్య, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, బాలినేని నాగేశ్వరరావు, ఉన్నం వెంకటశేషయ్య, మద్దినేని హరనాథబాబు, మోటుపల్లి శ్రీరామమూర్తి, కేఎల్.నరసింహారావు, యశోద, భవానీ తదితరులు వివిధ పాత్రలకు జీవం పోశారు. సురభి నాగరాజు, ఇండ్ల ఏసుపాదం, ఇండ్ల ప్రశాంత్‌లు అందజేసిన సంగీతం నాటకానికి వన్నెతెచ్చింది. ఇదే నాటకం బుధవారం సైతం ప్రదర్శించబడుతుందని నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు తెలిపారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం..!

జీజీహెచ్‌లో టన్నుల కొద్దీ వ్యర్థాలు ● ఎక్కడపడితే అక్కడ వేస్తున్న వైనం ● పట్టించుకోని అధికారులు



ఆసుపత్రి ప్రాంగణం, ఏసీబీ కార్యాలయం సమీపంలో పడేసిన వ్యర్థాల మూటలు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : ఒంగోలులోని జీజీహెచ్ అధికారులు ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ప్రతిరోజు ఆసుపత్రిలో జరిగే శస్త్రచికిత్సలు, కట్టుమెటీరియల్, దూది, సిరంజ్, గ్లౌజ్‌లు, ఇతర బయోవ్యర్థాలను నగరానికి దూరంగా, ప్రజారోగ్యానికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారులు వాటిని ఆసుపత్రి ఆవరణంలోనే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో రోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఒకవైపు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం కోసం జీజీహెచ్‌కి వచ్చేవారికి కొత్త రోగాలు వచ్చేలా ఉన్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉంటే, ఆసుపత్రి ఆవరణంలోనే కాకుండా జీజీహెచ్‌లోని మెడికల్ విద్యార్థులు హాస్టల్, డాక్టర్స్ క్వార్టర్స్ వెనుకవైపు రోడ్డులో కట్టకొద్ది మూటల్లో బయో వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేశారు. ఆ సమీపంలోని ఏసీబీ కార్యాలయం, అటవీ శాఖ, గృహ నిర్మాణ శాఖ, దామచర్ల సక్కుబాయమ్మ కాలేజి, వెలుగు శిక్షణ కేంద్రంతోపాటు జిల్లా జైలు అధికారుల క్వార్టర్స్ ఉన్నాయి. ఆ మార్గంలో నిరంతరం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆపరేషన్లు చేసిన గ్లౌజ్‌లు, దూది, సూదులు, సిరంజ్‌లు, ఇతర కట్టు సామగ్రి రోడ్డు పక్కన పడేయటంపై దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో జీజీహెచ్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రిలోని వ్యర్థాలను దూరంగా తరలించాలని కోరుతన్నారు.

అవీ..ఇవీ..

ప్రజలను దోచుకుంటున్న వైసీపీని తరిమికొట్టండి


ప్రచారం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో ప్రజలను దోచుకుతింటున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని టీడీపీ మహిళా నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ సూచనల మేరకు మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే కుటుంబంలోని ప్రతి వ్యక్తికి కలిగే లబ్ధిని వివరించారు. నియోజకవర్గంతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే బీఎన్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని, చంద్రబాబును సీఎంగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాధవి, సాహితి, శ్రీదేవి, లక్ష్మి, రాజేశ్వరి, అంజమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం అకౌంట్ టెస్ట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27: హెచ్ఎం అకౌంట్‌టెస్ట్ దరఖాస్తు గడువును మార్చి 4వతేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ కె.శివకుమార్ మంగళవారం ఓ ప్రకటకలో తెలిపారు. రూ.60 రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించి 7వతేదీలోపు దరఖాస్తు ప్రింట్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. కాగా మార్చి 3న జరగనున్న ప్రొఫెసనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్‌కు సంబంధించి హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : డీఎంహెచ్‌వో


అర్జీలను స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: జిల్లాలోని వైద్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో పాటు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సంబంధించిన జీతభత్యాలకు సంబంధించిన సమస్యలను అర్జీ రూపంలో వచ్చాయని తెలిపారు. ఆయా సమస్యలను కమిషనర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ ఏవో శ్రీవాణి, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భవిష్యనిధి సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: వివిధ ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ భవిష్యనిధికి సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని జేసీ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్‌లో మంగళవారం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నిధి ఆప్‌కె నికత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా నోడల్ ఆఫీసర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసరు ఎం.సమ్మయ్య మాట్లాడుతూ భవిష్యనిధి సంస్థలో వస్తున్న నూతన విధానాలను వివరించారు. యాజమాన్యం కార్మికులకు, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలకు పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బినవీస్‌కృష్ణ, హెచ్‌ఆర్ శర్మ, సుధాకర్, రామారావు, శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను ప్రోత్సహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను ప్రోత్సహించాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత దశాబ్దకాలంగా స్వచ్ఛంద సేవా సంస్థల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూడటంతో పాటు అనేక చట్టాల ద్వారా ప్రాధాన్యతను తగ్గించారన్నారు. సేవా కార్యక్రమాల పేరుతో కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, బడా రాజకీయనాయకులు ట్రస్టుల పేరుతో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాహితం, చైతన్యం కోసం లాభాపేక్ష లేకుండా ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని ఆయన కోరారు.

పేస్‌లో ముగిసిన అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న శ్రీధర్, విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్నోవేటివ్ షోకేస్ అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. సొసైటీ ఫర్ డేటా సైన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక కోసం ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఓటుతో సాగనంపాలి : బీజేపీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటు ద్వారా సాగనంపాలని బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజాపోరు-2లో భాగంగా మంగళవారం నగరంలోని నెల్లూరు బస్టాండు, ఆంధ్రాబ్యాంకు, సీవీఎన్‌రీడింగ్ రూం సెంటర్, గాంధీరోడ్డు గాంధీబొమ్మకూడలిలలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ విస్మరించారని ఆరోపించారు. దేశంతో పాటు అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శెగ్గం శ్రీనివాసరావు, తోగంటి శ్రీనివాసరావు, బొద్దులూరి ఆంజనేయులు, గుర్రం సత్యనారాయణ, కోటేశ్వరి, సత్యవతి, పద్మావతి, రాయపాటి అజయ్, సంజీవకుమార్, మఠంపల్లి దుర్గేష్, కొఠారి సుధాకర్, రామాంజనేయులు, తిరుమల, మిరియం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


వీసీ అంజిరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఎం. అంజిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని శ్రీనాగార్జున డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ అంజిరెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. డాక్టర్ చిటితోటి జీవన్ మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ముందుకు సాగాలన్నారు. విద్యా సంస్థల చైర్మన్ వి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీలో జరిగే జీఆర్బీ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.వసంతలక్ష్మి, ఆర్.యోగయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం

• నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



విజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

చీమకుర్తి, ఫిబ్రవరి27 : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. చీమకుర్తి పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కి మహిళలు, యువకులు ఘనస్వాగతం పలికారు. ఎన్టీఆర్‌నగర్, ఎస్‌ఎస్‌పీకాలనీలో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ ఈ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేయబోయే సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, ముప్పూరి చలమయ్య, మేదరమెట్ల సుబ్బారావు, జానీ, తోపూరి సుజాత, గొల్లపూడి రమాదేవి, వైపీ.వీరయ్య జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరాం, దరిమడుగు నాగరాజు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసిన నిర్వాహకులు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి27: అమ్మనబ్రోలులోని సీఎస్ఆర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రథమ విజేత మేక వైష్ణవికి రూ.2వేలు, ద్వితీయ బహుమతి టి.బ్రహ్మేంద్రచౌదరికి రూ.1200, తృతీయ బహుమతి పి.చక్రవర్తికి రూ.800తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే బి.హేమసాయి, పి.రాహుల్‌కు ఒక్కొక్కరికి రూ.500 వంతున ప్రోత్సాహక బహుమతిగా అందించారు. కార్యక్రమంలో మేనేజర్ యు.అబ్దుల్‌రహీమ్, లీడ్ బ్యాంక్ అధికారి బి.అనిల్‌కుమార్, హెచ్‌ఎం ఎం.సత్యవతి పాల్గొన్నారు.

220మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి27: నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 220మందికి వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ రాణి, మార్కెటింగ్ ప్రతినిధి షేక్ రఫి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ ఆత్మహత్య

మైనర్ బాలిక అదృశ్యం కేసులో పోలీసుల విచారణ

రైలు కిందపడి మృతి

కనిగిరి(సీఎస్‌పురం), ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 27 : కనిగిరి నియోజకవర్గ పరిధిలోని సీఎస్ పురం మండలంలోని అంబవరం కొత్తపల్లికి చెందిన సచివాలయ గ్రామ సర్వేయర్ ఒంగోలులో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. సీఎస్‌పురం ఎస్‌ఐ చెప్పిన వివరాల ప్రకారం... జిల్లాలోని చీమకుర్తి మండలం దేవరంపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి(26) సీఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లి గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ బాలిక అదృశ్యంపై అనుమానంతో గోపిరెడ్డిని సోమవారం విచారణకు పిలిచారు. విచారణలో "ఆ బాలిక తన వద్ద శనివారం వరకూ ఉందని, ఆ తర్వాత ఒంగోలులో వదిలి పెట్టానని.. ఇక్కడెలా ఉంటావని ప్రశ్నిస్తే అనాథ ఆశ్రమంలో ఉంటానని చెప్పిందని" గోపిరెడ్డి తెలిపాడు. ఆ బాలికను వెతికేందుకు గోపిరెడ్డి వెంట కొంతమంది సిబ్బందిని ఒంగోలు పంపించారు. ఆశ్రమంలో బాలిక లేకపోవటంతో చుట్టుపక్కల ఒంగోలులో వెతకటం ప్రారంభించారు. ఈ క్రమంలో ట్రెండ్స్ వద్ద టీ తాగుతూ ఉండగా, గోపిరెడ్డి టాయిలెట్‌కి అని కనిపించకుండా వెళ్లిపోయాడు. ఆ తర్వాత మంగళవారం 12గంటల సమయంలో రైలు కింద పడి యువకుడు మృతి చెందినట్లుగా సమాచారం రావటంతో అతని వద్ద ఉన్న ఐడెంటీ కార్డు ఆధారంగా గోపిరెడ్డిగా తేలింది. బాలిక ఆచూకీ మాత్రం తెలియలేదు. బాలిక తల్లిదండ్రులు మౌఖిక ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.



గోపిరెడ్డి మృతదేహం

భూముల పంపిణీలో అక్రమాలపై విచారణ



విచారిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

త్రిపురాంతకం, ఫిబ్రవరి 27: ఇటీవల పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంటు కమిటీ భూములకు సంబంధించి అక్రమాలు జరిగాయంటూ మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు మాజీ ఎంపీపీ అల్లె అంజనేయరెడ్డి ఫిర్యాదు చేశారు. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల సమన్వయ సమావేశానికి వచ్చిన సబ్‌కలెక్టర్‌ను కలిసిన అంజనేయరెడ్డి పలు వివరాలను అందజేశారు. ప్రస్తుత వీఆర్వో డబ్బులు తీసుకొని అసైన్‌మెంట్ కమిటీలో విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పట్టాలిచ్చారని, రిటైర్డ్ ఆర్మీ వారికి ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపారని ఆరోపించారు. దీనికి తోడు సర్వే నెంబరు 804లో కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దానికి వీఆర్వో సహకరిస్తున్నారని వీటిపై విచారణ జరిపించాలని, చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు, సర్వేయరు ఇతర సిబ్బందితో కలిసి భూముల పరిశీలనకు వెళ్లారు. కమిటీలో పంపిణీ చేసిన భూములను పరిశీలించారు. దీనిపై విచారణ చేసి నివేదికను పంపాలని తహసీల్దారును ఆదేశించారు. సర్వే నెంబరు 804లో ఆక్రమిత భూములను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఆక్రమిత భూమిని ఏపీఐఐసీకి అప్పగించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపారని, రికార్డులను పరిశీలించి, ఆక్రమణలను తొలగించాలని, చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టరు తహసీల్దారును ఆదేశించారు.

కానిస్టేబుల్ ఇంట్లో రూ.2లక్షల సొత్తు చోరీ

ఇంటికి అరకిలోమీటర్ లోపే డ్యూటీ చేస్తున్నవైనం

మార్టూరు, ఫిబ్రవరి 27: రాత్రి డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ ఇంట్లో దొంగలు లూటీ చేశారు. దాదాపుగా రెండున్నర లక్షలకు పైగా విలువైన 4 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు వెండి వస్తువులు, రూ.9వేల నగదును దొంగలు ఎత్తుకుపోయారు. మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవర్‌కు తూర్పువైపున సర్వీసు రోడ్డుపక్క ఉన్న కాలనీలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. చోరీ జరిగిన ఇంటికి అరకిలోమీటర్ సమీపంలోనే కానిస్టేబుల్ హైవే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. ఎం.యోహోన్ నాయక్ హైవే పెట్రోలింగ్ మొబైల్ వాహనంలో పని చేస్తుంటారు. జాతీయ రహదారిపై మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి ఇసుక దర్శి ఫ్లైవోవర్ మీదుగా రాజుపాలెం కూడలి వరకు కానిస్టేబుల్ యోహోన్ కారులో పెట్రోలింగ్ చేస్తుంటారు. సోమవారం రాత్రి యథావిధిగా పెట్రోలింగ్ కారులో డ్యూటీకి వెళ్లారు. అతని భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వెళ్లి ఇంటి తాళాలను గమనించి వచ్చారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో మరలా కానిస్టేబుల్ ఇంటికి వెళ్లిగా తాళాలు తీసి ఉండడంతో ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో ఉండాల్సిన బంగారు వస్తువులు బ్రాస్‌లెట్, ఉంగరం, జుంకాలు, వెండి పట్టాలు, వెండి చైన్‌తో పాటు రూ.9వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు మార్టూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ సైదా, కానిస్టేబుల్ ప్రసాద్ వచ్చి పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఇదిలావుండగా రోజూ ఇంటికి సుమారు 500 మీటర్ల దూరంలో ఒంగోలు వైపు పెట్రోలింగ్ చేస్తూ రోజూ అక్కడే రోడ్డు పక్కనే పోలీసులు కారును పార్కింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో చోరీ జరగడం అటు పోలీసులను, కాలనీవాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. నెల కిందట దొంగతనం జరిగిన ఇంటి నుంచి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న భారత్ గ్యాస్ కార్యాలయంలో అర్ధరాత్రి దొంగతనం చేయడం సీసీ పుటేజీలో ఉంది. మళ్లీ ఇదే రోడ్డులో కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిసమయంలో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

ఐబీ సిలబస్ అమలు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 27: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బ్యాకలారియేట్(ఐబీ) సిలబస్ అమలుపై మంగళవారం ఇంగ్లాండ్, అమెరికా దేశాల నుంచి వచ్చిన ఏడుగురు బృందం పరిశీలించారు. పర్సనల్ డెవలెప్‌మెంట్ స్పెషలిస్టు ఎరిక్‌బాబర్, పోస్టు ఆథరైజేషన్ పాలసీ ఎండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీగ్రీన్‌లు మండలంలోని మైనంపాడు ప్రభుపాఠశాల, డైట్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ గిరిబాబుయాదవ్, డైట్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న గీత

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 27: వ్యాపారవేత్తలు, అకౌంటెంట్లు ఎంఎస్ఎంఈపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్, బెంగళూరుకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ ఏవీ.గీత పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు నగరం గాంధీరోడ్డులో ఎంఎస్ఎంఈపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం చట్టాలలో చేసిన మార్పుల గురించి విపులంగా వివరించారు. ప్రముఖ ఆడిటర్ తిరువాయి కుమార్ మాట్లాడుతూ అకౌంటెట్లు, ఆడిటర్లు తమ క్లయింట్స్ విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోగా పేరకం శ్రీమన్నారాయణ అధ్యక్షునిగా, చుండూరు ప్రేమ్‌కుమార్ ఉపాధ్యక్షునిగా, దుడ్డు సౌజన్య కార్యదర్శిగా, కొణిజేటి కిషోర్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఈసీ మెంబర్ల చేత గీత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్‌బాబు

చీమకుర్తి, ఫిబ్రవరి 27 : ఎన్నికల విధుల పట్ల పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా నిర్వహించాలని డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు కోరారు. మంగళవారం సాయంత్రం చీమకుర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌ని తొలిసారిగా సందర్శించారు. సీఐ దుర్గాప్రసాద్, డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. తదుపరి స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చివరగా సిబ్బందితో సమావేశమై ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై పలు సూచనలు అందించారు.

మహాచండీ యాగం చేసిన మాగుంట



యాగం చేస్తున్న మాగుంట, కుటుంబసభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు మహాచండీ యాగం చేశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మంగళవారం వేదపండితులు ఈ యాగం చేశారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, తనయుడు రాఘవరెడ్డి, ఆయన సతీమణి మాగుంట చందనలు ఈ యాగంలో పాల్గొన్నారు. జిల్లాలోని ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ యాగం చేపట్టినట్లు మాగుంట తెలిపారు. కాగా ఒక వైపు యాగం జరుగుతుండగా ఇంకొక వైపు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మాగుంట అభిమానులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. కాగా యాగంలో కూడా మాగుంట అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నూరుశాతం పోలియో చుక్కలు వేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వంశీధర్

సింగరాయకొండ, ఫిబ్రవరి 27 : మండలంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు నూరుశాతం పోలియో చుక్కలు వేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.వంశీధర్ సూచించారు. వచ్చేనెల 3న నిర్వహించే పల్స్ పోలియోపై మంగళవారం మండలంలోని అంగన్‌వాడీలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వంశీధర్ పలు సూచనలు చేశారు. సంచార జాతుల వారిని గుర్తించి విధిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్యకృష్ణ, శ్రీధర్, ఆరోగ్యపర్యవేక్షకుడు సయ్యద్ మసూద్ అలీ, సీహెచ్‌వో సాంబశివరావు, రాజమ్మ, సంపూర్ణమ్మ, ఆదిలక్ష్మి, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 27: రానున్న ఎన్నికలలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం మార్కాపురం సబ్‌డివిజన్‌లోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌పై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ తేదీ మార్పు

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 27 : మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను రాష్ట్ర న్యాయాధికార సేవాసంస్థ ఆదేశాల మేరకు మార్చి 16వ తేదీకి మార్చినట్లు స్థానిక అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసా రాదానమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి కారణం గా మార్పు చేసినట్లు వారు తెలిపారు. కక్షిదారులు ఈ మార్పును గమనించి మార్చి 16న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్, రెవెన్యూ, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈ మార్పును కక్షిదారులకు, ప్రజలకు తెలుపాలన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంభం, ఫిబ్రవరి 27 : జంగంగుంట్ల సమీపంలో కంభం నుంచి మార్కాపురం వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించిన ఘటన సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సైదాపురం గ్రామానికి చెందిన కొట్టె రాఘవేంద్ర (45) మార్కాపురంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం స్వగ్రామంలో జరుగుతున్న శుభకార్యానికి వచ్చి తిరిగి మార్కాపురం వెలుతుండగా జంగంగుంట్ల గ్రామసమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిందపడిన రాఘవేంద్ర తలపై నుంచి వాహనం వెళ్ళడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇరువురికి గాయాలు

కొమరోలు, ఫిబ్రవరి 27: మండలంలోని దద్దవాడ గ్రామ సమీపంలో కారు- మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గిద్దలూరు వైపు కారు వెళ్తుండగా మోటర్‌సైకిల్ తాటిచర్ల మోటు వైపు వెళుతోంది. దద్దవాడ సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వార గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

ఈఈ తీరు మార్చుకోకపోతే సామూహిక సెలవులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27: విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేశ్వరరావు తీరు మార్చుకోకపోతే సామూహిక సెలవులు తప్పవని వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. మార్కాపురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలు ధరించి మంగళవారం రెండో రోజు కూడా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈఈ నాగేశ్వరరావు ఏకపక్ష నిర్ణయాలు, పక్షపాత ధోరణి తగదన్నారు. ఈ నెల ఆఖరు లోపు పద్ధతి మార్చుకోకుంటే సామూహిక సెలవులు పెడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కేవీ రమణారెడ్డి, కార్యదర్శి ఎం.రామారావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీలోకి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

వైసీపీని సాగనంపేందుకు సంసిద్ధం

- ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు
- జమ్మిదోర్నాలలో భవిష్యత్తు గ్యారెంటీ
- ఆపార్టీలో పలువురి చేరిక

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 27: ప్రజా వ్యతిరేక విధానాలతో కాలం వెళ్లదీసిన వైసీపీని సాగనంపేందుకు జనం సంసిద్ధమయ్యారని, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని జమ్మిదోర్నాల గ్రామంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు గ్రామంలోని ప్రజలను కలిసి ప్రభుత్వం పేదప్రజలను మోసం చేసిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను తెలియజెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు ఆర్థిక తోడ్పాటు నిచ్చిందన్నారు. కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు మంజూరు, మహిళలకు ఆస్తిలో హక్కుచట్టం, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, రైతులకు అండగా విపత్తుల నుంచి ఆదుకునేందుకు బీమా, పంట నష్ట పరిహారం అందజేత, యాంత్రీకరణ పథకం ద్వారా ట్రాక్టర్లు, పవర్‌స్ప్రేయర్లు, వ్యవసాయ ఉపకరణాలు అందజేసిన ఘనత టీడీపీదేనన్నారు. క్లిష్ట సమయాల్లో కూడా ట్యాంకర్లతో నీటిని అందించామని, నిరుద్యోగులకు భృతి, అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఉన్నత విద్య, విదేశీ విద్యకు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. టీడీపీ, జనసేన సమన్వయంతో పేదల ప్రభుత్వం అధికారంలోకి వస్తోందన్నారు. విజన్ ఉన్న ప్రజా నాయకుడు చంద్రబాబు నాయుడు తిరిగి రాష్ట్రానికి పూర్వ వైభవం తెస్తాడన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ సమ్మద్ బాషా, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, షేక్ బాష, కె శ్రీనివాసులు, ఎలకపాటి చంచయ్య సీనియర్ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్ సుబ్బరత్నం, నాగెళ్ల సత్యనారాయణ, షేక్ రఫీ,షేక్ మంజూర్ భాష, కె.సుబ్బారెడ్డి, వౌలాలి పాల్గొన్నారు.



కొమరోలులో బాండ్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పర్యటనలో భాగంగా ఎరిక్షన్‌బాబు సమక్షంలో మాజీ ఉప సర్పంచి సుభాని,షేక్ మంజూర్ భాష ఆధ్వర్యంలో దోర్నాల ఇందిరా నగర్‌కు చెందిన 20 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.

రాయవరంలో 'భవిష్యత్తు గ్యారెంటీ'

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్య క్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విష్ణుర్‌రెడ్డి నాయకులతో కలిసి మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ యువతకు ఉపాధి అవకాశాలు, స్కూళ్లకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం, ప్రతి ఏటా రైతుకు ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. అలాగే ప్రతి మహిళకు నెలకు పదిహేను వందల రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అమలుజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు జవ్వాజి రామానుజలరెడ్డి, బొగ్గు శేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరోలు : బడుగు బలహీనవర్గాల సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమని మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల, అల్లీనగరం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాలమేరకు టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అరాచక వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రాక్షస పాలన చేస్తున్నజగన్‌రెడ్డి పని అయిపోయిందన్నారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇంటిటికి తిరిగి బాబుష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ బాండ్లు పంపిణీచేశారు. కార్యాక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, నాయకులు సాయి, ప్రవీణ్, వెంకటసుబ్బయ్య, రామస్వామి, నక్కా రమణ, సయ్యద్ రఫీ, పుల్లయ్య, సుబ్బరాయుడు, చిన్న తిరుమయలయ్య, బాలయ్య, అల్లురయ్య పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న విష్ణురెడ్డి

అవీ..ఇవీ..

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

త్రిపురాంతకం, ఫిబ్రవరి 27: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8 నుండి 10 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులకు సూచించారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గతేడాది కన్నా భక్తులు పెరిగే అవకాశం ఉన్నందున వారికి మెరుగైన ఏర్పాటు చేయాలని సూచించారు. సాగర్ కాలువవద్ద, చెరువుకట్ట వద్ద బారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. 104, 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని చర్యలను తీసుకోవాలని ఎస్సైని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణ శివప్రసాద్, ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, సర్పంచ్ పి.వెంకటలక్ష్మీ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన

గిద్దలూరు, ఫిబ్రవరి 27 : మండలంలోని గ్రామపరిధిలో సాగవుతున్న మామిడి తోటలను ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ పరిశీలించారు. మామిడి తోటల్లో పూత, పిందె రాలుతుండడాన్ని గమనించారు. నివారణ కోసం 4.50 లీటర్ల నీటిలో 1 ఎంఎల్ ప్లనోఫిక్స్ మందును కలిపి పిందెగా ఉన్నపుడే పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఒక శాతం యూరియాను మామిడి కాయ, నిమ్మకాయ సైజులో ఉన్నపుడే మరోసారి పిచికారి చేయాలన్నారు. తామర పురుగు రసం పీల్చుకోవడం వలన చిగురు, ఆకులు రాలిపోతాయని, రాతిమంగు ఏర్పడి నాణ్యత పోతుందని పేర్కొన్నారు. నివారణ కోసం పిప్రోలిన్ 2 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

కరాటే పోటీలో పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రశంసపత్రాలు, పతకాలతో విద్యార్థులు

గిద్దలూరు, ఫిబ్రవరి 27 : కదిరి పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో గిద్దలూరులోని స్ప్రింగ్ బోర్డు పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. కాటాస్ విభాగంలో మాన్విత్ కార్తీ, హస్వినీ బంగారు పతకాలు సాధించారు. కుమితే విభాగంలో రాహుల్‌తేజ్, కార్తీ, హస్వినీ, గురుచరణ్, అలెక్స్, హరి, అర్జున్‌రామ్, ఉమేష్‌లకు కాంశ్య పతకాలు, గణేష్, భానుప్రకాశ్, అబ్దుల్‌మసద్‌లు రజత పతకాలు సాధించారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన మాస్టర్ షాషావలిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జె.వి.నారాయణ, ప్రిన్సిపాల్ శ్వేత అభినందించారు.

సార్వత్రిక ఎన్నికలకు సీపీఐ సిద్ధం

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

ఎర్రగొండపాలెం, ఫి బ్రవరి 27 : సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ పోటికి సిద్ధమని కాంగ్రెస్ వామపక్షాల పొత్తులో భాగంగా ఇండియా కూటమి తరఫున సీపీఐ పోటీ చేస్తోందని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశాని సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించేందుకు సీపీఐ కూటమికి మద్దతు ఇస్తోందన్నారు. బీజేపీని ఓడించేందుకు దేశంలో 26 పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడినాయని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇసుకస్కాం, లిక్కర్ స్కాం, భూస్కాంలు పాల్పడి దోచుకుంటోందని అన్నారు. రానున్న రోజుల్లో సీపీఐ పార్టీ బడుగు, బలహీన వర్గాల తరపున పోరాడుతుందని అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు కేవీ.కృష్ణగౌడ్, జీవీ.గురునాథం, ఐదు మండలాల పార్టీ కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

సాయి బాలాజీలో రంగుల దినోత్సవం



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 27: స్థానిక సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్, ఆరెంజ్, రెడ్ రంగులలో రకరకాల పరికరాలు, కూరగాయలు, పండ్లు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు రజాక్, పాఠశాల డైరెక్టర్ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 27: పంటల సస్యరక్షణతో రైతులకు అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి శైలజ తెలిపారు. పెద్దారవీడు గ్రామాల పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పంటలలో చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులు విత్తన శుద్ధి, జీవ ఎరువుల వాడకం, పచ్చిరొట్టె ఎరువులు తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా సాంకేతిక సమాచారాన్ని చేరవేయటం జరుగుతుందని తెలిపారు. కంది, మినుము, సెనగ, పొగాకు, మిరప పంటల సాగులో తెగుళ్ల నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శేషమ్మ, బుజ్జి బాయ్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదిలక్ష్మీ, చిన్న, రైతులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 27: రానున్న ఎన్నికలలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం మార్కాపురం సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌పై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.డీఎస్పీ బాలసుందరరావు, మార్కాపురం సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ తేదీలో మార్పు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 27 : మార్చి 9న నిర్వహించనన్న జాతీయ లోక్‌అదాలత్‌ను రాష్ట్ర న్యాయాధికార సేవాసంస్థ ఆదేశాల మేరకు మార్చి 16వ తేదీకి మార్చినట్లు స్థానిక అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి కారణంగా మార్పు చేసినట్లు వారు తెలిపారు. కక్షిదారులు ఈ మార్పును గమనించి మార్చి 16న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్, రెవెన్యూ, మున్సిపల్, బిఎస్ఎన్ఎల్ అధికారులు ఈ మార్పు కక్షిదారులకు, ప్రజలకు తెలుపాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంభం, ఫిబ్రవరి 27 : జంగంగుంట్ల సమీపంలో కంభం నుంచి మార్కాపురం వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించిన ఘటన సోమవారం రాత్రి 11గంటల సమయంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సైదాపురం గ్రామానికి చెందిన కొట్టె రాఘవేంద్ర (45) మార్కాపురంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం స్వగ్రామంలో జరుగుతున్న శుభకార్యానికి వచ్చి తిరిగి మార్కాపురం వెలుతుండగా జంగంగుంట్ల గ్రామసమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిందపడిన రాఘవేంద్ర తలపై నుంచి వాహనం వెళ్ళడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇరువురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

కొమరోలు, ఫిబ్రవరి 27: మండలంలోని దద్దవాడ గ్రామ సమీపంలో కారు-మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గిద్దలూరు వైపు కారు వెళ్తుండగా మోటర్‌సైకిల్ తాటిచర్లమోటు వైపు వెళుతోంది. దద్దవాడ సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్రగాయాలైయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వార గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

ఈఈ తీరు మార్చుకోకపోతే సామూహిక సెలవులు



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27: విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేశ్వరరావు తీరు మార్చుకోకపోతే సామూహిక సెలవులు తప్పవని వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం రెండో రోజు కూడా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈఈ నాగేశ్వరరావు ఏకపక్ష నిర్ణయాలు, పక్షపాత ధోరణి తగదన్నారు. ఈ నెల ఆఖరు లోపు పద్ధతి మార్చుకోకుంటే సామూహిక సెలవులు పెడతామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కేవీ రమణారెడ్డి, కార్యదర్శి ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ నూరుశాతం పూర్తి చేయాలి

- ఏపీఎం రమేష్ బాబు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 27: గ్రామ స్వయం సహాయక సంఘాలలోని రుణాల రికవరీ నూరుశాతం పూర్తి చేయాలని, డీఆర్‌డీఏ వైకేపీ ఏపీఎం రమేష్ బాబు, వీవోఏలను కోరారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మండలంలోని మండల సమాఖ్య కమిటీ, గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు, వీవోఏలతో మండల సమాఖ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామాలలో స్వయం సహాయ సంఘ సభ్యుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గ్రామ సంఘాలలో స్త్రీ నిధి, ఉన్నతిలలో సభ్యులు తీసుకున్న రుణాలను 100శాతం రికవరీ చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే సర్వే యాప్‌లలో సభ్యుల పూర్తి వివరాలను సకాలంలో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు, ఉపాధ్యాక్షురాలు, కోశాధికారి, ఎల్సీ నాగభూషణం, సీసీలు మనోకుమారి, స్వామి, అకౌంటెంట్ నాగమణి, వీవోఏలు, గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూముల పంపిణీలో అక్రమాలపై విచారణ



విచారిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

త్రిపురాంతకం, ఫిబ్రవరి 27: ఇటీవల పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంటు కమిటీ భూ ములకు సంబంధించి అక్రమాలు జరిగాయంటూ మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి ఫిర్యాదు చేశారు. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల సమన్వమయ సమావేశానికి వచ్చిన సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఆంజనేయరెడ్డి పలు వివరాలను అందజేశారు. ప్రస్తుత వీఆర్వో డబ్బులు తీసుకొని అసైన్‌మెంట్ కమిటీలో విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పట్టాలిచ్చారని, రిటైర్డ్ ఆర్మీ వారికి ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపారని ఆరోపించారు. దీనికి తోడు సర్వే నెంబరు 804లో కొంద రు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దానికి వీఆర్వో సహకరిస్తున్నారని వీటిపై విచారణ జరిపించాలని, చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు, సర్వేయరు ఇతర సిబ్బందితో కలిసి భూముల పరిశీలనకు వెళ్లారు. కమిటీలో పంపిణీ చేసిన భూములను పరిశీలించారు. దీనిపై విచారణ చేసి నివేదికను పంపాలని తహసీల్దారును ఆదేశించారు. సర్వే నెంబరు 804లో ఆక్రమిత భూములను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఆక్రమిత భూమిని ఏపీఐఐసీకి అప్పగించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపారని, రికార్డులను పరిశీలించి, ఆక్రమణలను తొలగించాలని, చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టరు తహసీల్దారును ఆదేశించారు.

ఐనముక్కలలో నీటి సమస్యను పరిష్కరించాలి

పంచాయతీ కార్యాలయం వద్ద మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 27: మండలంలోని ఐనముక్కల గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గత పదిహేను రోజులుగా నీటికి ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆరోపించారు. పనుల కాలం కావడంతో పొలం వెళ్లి ఇంటికొస్తే నీటి కొరత వేధిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు.దీంతో రోడ్డెకాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. నీళ్లివ్వాలంటూ కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. సర్పంచి, అధికారులు బయటకు రావాలి మాకు నీళ్లివ్వాలంటూ నినాదాలు చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పాటు ఆందోళన ఉధృతం చేయడంతో గ్రామకార్యదర్శి మోహన్ రావు వచ్చి క్రొత్తగా బోరు వేయిస్తామని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

శివారు కాలనీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి



ఇందిరమ్మకాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27: శివారు కాలనీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి సమ స్యలు పరిష్కరించాలని బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జ్ పీవీ కృష్ణారావు డిమాండ్ చేశారు. ప్రజా పోరు యాత్రలో భాగంగా మంగళవారం 14వ వార్డులోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బీజేపీ నాయకులకు సమస్యలు వివరించారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 15 సంవత్సరాలు పూర్తి అయినా ఒక్క ప్రజాప్రతినిధి కూడా తమకు న్యాయం చేయలేదన్నారు. కృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మార్కాపురం పట్టణ ప్రాంతానికి 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించిన మున్సిపల్ పాలకులు సరైన పద్ధతిలో నిధులు వినియోగించుకోలేదన్నారు. ప్రజా ప్రతినిధులు పదవులను ఎంజాయ్ చేస్తున్నారే తప్పా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టే పరిస్థితులో లేరన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీ, చంద్రశేఖర్, శ్రీకాంత్, జీవీ రెడ్డి, సుబ్బారావు, మురళీ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : దేశలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాలన్న, అన్ని సామాజిక వర్గాల ప్రజలకు రక్షణ కావాలంటే కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని పీవీ.శివారెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ ప్రజా పోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమపథకాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ప్రజలకు రక్షణ ఉండాలంటే మోదీ 3వసారి ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం దేశానికి చేసింది ఏమిలేదని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి పదేళ్లలో బిజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపీ ఇన్‌ఛార్జి పి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు ఎం సూర్యనారాయణ, ఆతుకూరి రామయ్య, డి.బాదరయ్య గౌడ్, ప్రతాప్ రెడ్డి,బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డి గెలుపునకు సహకరించాలి



సభకు హాజరైన ముస్లింలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 27 : పట్టణంలోని షాదీఖానాలో మంగళవారం జరిగిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎండీ షరీఫ్ మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఇక్కడ పోటీ చేస్తున్న టీడీపీ, జనసేనల అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి ముస్లింలంతా ఒక్కతాటిపై వచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అశోక్‌రెడ్డి విజయమే తమ విజయంగా భావించి అందరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యునిగా ఉన్న కాలంలో నియోజకవర్గానికి ఎక్కువ నిధులు రాబట్టి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ముస్లిం ఆత్మీయ సదస్సుకు కంభం, బేస్తవారపేట మండలాలల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్.రశీదు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

బేస్తవారపేట,ఫిబ్రవరి27:బేస్తవారపేట మండలంలోని జేసీ అగ్రహా రం గ్రామ సచివాలయం అధికారుల ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. సచివాలయంలో ప్రజలకు పలురకాల సేవలు అందించడానికి తగిన సిబ్బందిని ఏర్పాటు చేసిన వారు ప్రజలకు అందుబాటులో ఉండటంలేదు. మారుమూల ప్రాంతమని ఇక్కడ అంతగా పనిబాటలేదని అనుకున్నారేమో ఏమో ఆ కార్యాలయ సిబ్బంది ఒక్కరిని చూసి మరోకరు ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. సమయం పాలన పాటించడంలేదు. ఏదో మొక్కుబడిగా వచ్చి వెళుతు న్నారు. అక్కడ రికార్డు నమోదు సక్రమంగా లేదు. అడిగేవారు లేరు. కొన్ని రకాల సేవల అధికారులు ఆయితే నెలల తరుబడి సచివలయానికి వచ్చిన దాఖలాలు కనిపించలేదు. దీంతో రైతులు ఏదైన పనికోసం బేస్తవారపేట వచ్చి పనిచేయించుకుంటున్నారు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో సచివాలయ సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాభావంతో కొండెక్కిన పశుగ్రాసం ధరలు

వలస వెళుతున్న మూగ జీవాలు



వలసపోతున్న మూగజీవాలు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 28: పశుగ్రాసం ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో పాడి రైతులు బోరుమంటున్నారు. మండలంలో సగం గ్రామాల్లో వరిసాగు లేకపోవడంతో ఇతర ప్రాంతాలనుంచి రైతులు వరిగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, సాగర్ జలాలు రాకపోవడం, ఆయకట్టులో వరి సాగు చేయకపోడం, బోర్లు ఉన్న ప్రాంతంలో పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు వరిసాగు చేయలేదు. దీంతో వరిగడ్డి రేట్లు అమాంతం పెరిగాయి. ట్రక్కు గడ్డి రూ.15 వేల నుండి రూ.17 వేలకు కొనుగోలు చేసి గ్రామాలకు తరలించుకుని వాములు వేసుకోవడానికి మరికొంత చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు వై.పాలెం ప్రాంతంలో వరిసాగు లేకపోవడం, వర్షాభావంతో పచ్చిక లేకపోడంతో, పాడి కూడా అంతంతమాత్రం ఉండడంతో భారం మోయలేని రైతులు పశువులను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. మండలంలోని టి.చెర్లోపల్లి, లేళ్లపల్లి, దువ్వలి, రామసముద్రం, మిట్టపాలెం, నడిగడ్డ, కేశినేనిపల్లి, గొల్లవాండ్లపల్లి గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని మిగిలిన మండలాల గ్రామాల్లోని రైతులు గుంటూరు జిల్లాలోని వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం ప్రాంతాలనుండి వరిగడ్డిని కొనుగోలు చేసి పాడి పశువులను కాపాడుకుంటున్నారు. రోజుకు సగటున 100 నుండి 150 ట్రాక్టర్ల వరిగడ్డి త్రిపురాంతకం గుండా రవాణా అవుతోంది. పశ్చిమ గ్రామాల్లో వందల సంఖ్యలో ఆవులు ఉండటంతో పశుగ్రాసంతోపాటు, తాగునీటికీ తీవ్రసమస్య ప్రారంభమైంది. దీంతో ఆయా గ్రామాలలోని రైతులు ఆవులను తూర్పు ప్రాంతాలకు తరలిస్తూ వలస వెళుతున్నారు. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసాన్ని రాయితీపై అందించాలని పశురైతులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డి

పశుగ్రాసంకోసం వలస వెళుతున్నాం



గ్రామాల్లో తీవ్ర వర్షాభావంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. ప్రజలకు, పశువులకూ తాగునీరు లభించే పరిస్థితి లేదు. నాకు 100 ఆవులు ఉన్నాయి. తప్పని పరిస్థితులలో పశువులను కాపాడుకునేందుకు వాటిని తోలుకుని వలస వెలుతున్నాం. **కుర్రా వెంకటేశ్వర్లు, కొలుకుల**

క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ

కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 27 : క్రీడాకారుల జీవితాలతో వైసీపీ సర్కార్ చెలగాటమాడుతోందని కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ క్రికెటర్ కంటే వైసీపీకి చెందిన వీధి నేత పంతం ఎక్కువైందని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి అధికార జమానాలో ఆడుదాం ఆంధ్రా అంటే క్రీడాకారుల జీవితాలతో ఆటలాడుకోవటం అని తెలిసిందని తెలిపారు. భారత రంజీ క్రికెట్ జట్టులో 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసీపీ కార్పొరేటర్ కొడుకును పద్ధతి మార్చుకోవాలని రంజీ జట్టు కెప్టెన్ హనుమావిహారి మందలించటమే పెద్ద అపరాధంగా మారిందని పేర్కొన్నారు. భారత్ తరఫున 16 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, ఆంధ్రా రంజీ జట్టుకు ఏడేళ్లు ఏకధాటి కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ముందు వైసీపీకి చెందిన వీధి నాయకుడి పంతం గెలవడం ఎంతో బాధాకరమని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో విలువలు మంట గలసాయని చెప్పటానికి ఈ సంఘటనే ఒక నిదర్శనమని తెలిపారు. హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణలు చెప్పి అతనికి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

తెలుగుదేశం హయాంలోనే మాదిగలకు న్యాయం


చంద్రన్న మాటే మాదిగలకు బాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

దర్శి, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం హయాంలోనే మాదిగలకు న్యాయం జరిగిందని నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరిశుద్ధరావు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రన్న మాటే మాదిగలకు బాట పేరుతో ముద్రించిన వాల్‌పోస్టర్లను నియోజకవర్గ మాదిగ మహానాడు అధ్యక్షుడు పీ మోషే, పరిశుద్ధరావు తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరికీ సామాజిక న్యాయం చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహానాడు నాయకులు సుధాకర్, నోవా, దేవా, యోగేశ్వరరావు, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి వరగాని పౌలు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, నాయకులు రాజు, జాన్‌సామ్యేల్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27: ఒంగోలులోని రెండు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ప్రారంభమైన ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా జరిగింది. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ యాక్షన్ ఇండియా సంస్థలో ఈ పరీక్ష జరిగింది. ఈ రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 380 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. ఒక పరీక్షా కేంద్రంలో కావలి నుంచి వచ్చిన ఇరువురు మహిళా అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని కంప్యూటర్ పరీక్షకు అనుమతించలేదు. మధ్యాహ్నం సెషన్‌లో ఈ రెండు కేంద్రాల్లో 390మందికి 81 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా మొదటి రోజు పరీక్షకు 123 మంది అభ్యర్థులు హాజరుకాలేదు.

టెట్‌సెల్ ఏర్పాటు

ఏపీ టెట్ పరీక్షకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా టెట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జిగా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ వ్యవహరిస్తారు. ఈ బృందంలో డీసీఈబీ కార్యదర్శి వై వెంకట్రావు, సూపరింటెండెంట్ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు, ఎంఎస్. కృష్ణకుమార్ ఉన్నారు. టెట్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు వస్తే సెల్‌ను సంప్రదించాలని వారు కోరారు.

అందని వైద్యం



తాళాలు వేసిన కంకణంపాడు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్


గన్నవరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అరకొరగా మందులు

వెలిగండ్ల మండలంలో ఆరోగ్య కేంద్రాలకు తాళాలు

అందుబాటులో లేని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బంది

వెలిగండ్ల, ఫిబ్రవరి 27 : ప్రజల ముంగిటే వైద్య సేవలందించాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఆశించినంత ఫలితాలు ఇవ్వడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు చేరువలో ఆరోగ్యం అందించడం కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల సేవలు అందని ద్రాక్షలా మారాయి. మండలంలో 7 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 12 రకాల వైద్య సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించాల్సి ఉంది. ఇవన్నీ ఉచితంగా అందించాల్సిన సేవలను గాలికి వదిలేశారు. 12 రకాల వైద్య సేవల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం ముఖ్యమైనది. వారికి పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు.

మండలంలోని పి. నాగులవరం, కంకణంపాడు, ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలాను మంగళవారం ఆంధ్రజ్యోతి తనిఖీ చేసింది. ఉదయం 12 గంటల సమయంలో కూడా కనీసం కేంద్రాల తలుపులు తీయలేదు. దీంతో కేంద్రాలకు వచ్చిన రోగులు తలుపులు తీయకపోవడంతో చూసి వెనక్కి వెళుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ క్యాంపులు ఉన్నప్పుడు మాత్రమే ఎంఎల్‌హెచ్‌పీలు వస్తారని, మిగతా రోజుల్లో కనిపించరని చెప్పారు. ఒక వేళ వచ్చినరోజు మందుల కోసం కేంద్రానికి వెళ్తే రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సరిపడా మందులు కూడా లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉగ్రతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం


పత్రాలను అందచేస్తున్న మనోహర్

పామూరు, ఫిబ్రవరి 27 : నియోజకవర్గంలో ఉపాధి, అభివృద్ధి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితోనే సాధ్యమని టీడీపీ పట్టణ ఎన్నికల కమిటి చైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ చెప్పారు. బాబు ష్యూరిటి - భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని పట్టణంలోని కనిగిరి రోడ్డులో మంగళవారం నిర్వహించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాకంటక పాలనా తీరుతో అన్నివర్గాల ప్రజలపై ధరల భారాలు పెరిగాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గల్లంతు కావాడం ఖాయమని చెప్పారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, జిల్లా కమిటి సభ్యుడు సయ్యద్ అమీర్‌బాబు, టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, బూత్ కమిటి ఇన్‌చార్జి నొస్సం నాగేంద్రచారి, ఇర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రైలు కింద పడి విలేజ్ సర్వేయర్ ఆత్మహత్య?


ఒంగోలులో రైలు కింద పడి మృతిచెందిన గోపిరెడ్డి

కనిగిరి(సీఎస్‌పురం), ఫిబ్రవరి 27 : కనిగిరి నియోజకవర్గ పరిధిలోని సీఎస్‌పురం మండలంలోని అంబవరం కొత్తపల్లికి చెందిన సచివాలయ గ్రామ సర్వేయర్ ఒంగోలులో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. సీఎస్‌పురం ఎస్‌ఐ చెప్పిన వివరాల ప్రకారం.. జిల్లాలోని చీమకుర్తి మండలం దేవరంపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి(26) సీఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లి గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ బాలికా అదృశ్యంపై అనుమానంతో గోపిరెడ్డిని సోమవారం విచారణకు పిలిచారు. విచారణలో "ఆ బాలిక తన వద్ద శనివారం వరకూ ఉందని, ఆ తర్వాత ఒంగోలులో వదిలి పెట్టానని.. ఇక్కడెలా ఉంటావని ప్రశ్నిస్తే అనాథ ఆశ్రమంలో ఉంటానని చెప్పిందని" గోపిరెడ్డి తెలిపాడు. ఆ బాలికను వెతికేందుకు గోపిరెడ్డి వెంట కొంతమంది సిబ్బందిని ఒంగోలు పంపించారు. ఆశ్రమంలో బాలిక లేకపోవటంతో చుట్టుపక్కల ఒంగోలులో వెతకటం ప్రారంభించారు. ఈ క్రమంలో ట్రెండ్స్ వద్ద టీ తాగుతూ ఉండగా, గోపిరెడ్డి టాయిలెట్‌కి అని కనిపించకుండా వెళ్లిపోయాడు. ఆ తర్వాత మంగళవారం 12గంటల సమయంలో రైలు కింద పడి యువకుడు మృతి చెందినట్లుగా సమాచారం రావటంతో అతని వద్ద ఉన్న ఐడెంటీ కార్డు ఆధారంగా గోపిరెడ్డిగా తేలింది. బాలిక వివరాలు మాత్రం తెలియలేదు. బాలిక తల్లితండ్రులు మౌఖిక ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న ఎలక్ట్రోల్ రిజిస్టేషన్‌అధికారి లోకేశ్వరరావు

దర్శి, ఫిబ్రవరి 27 : ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు చెప్పారు. దర్శిలో మంగళవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దర్శి సీఐ షమీఉల్లా, తహసీల్దారు సుజాత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్ పాల్గొన్నారు.

4నుంచి డ్వామా ఉద్యోగుల ఆందోళన బాట !

- 3న యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం
- సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెకు శ్రీకారం
- ఇప్పటికే ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కనున్నారు. అందుకోసం రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా జిల్లాల్లో ఉద్యమం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, డ్వామా పీడీలకు సమ్మె నోటీసులను కూడా అందజేశారు. సమ్మె నోటీసులు ఇచ్చిన యూనియన్ నాయకులు వచ్చేనెల 3వతేదీలోపు రాష్ట్ర స్థాయిలో జేఏసీ సమావేశం నిర్వహించి 4వతేదీ నుంచి విధులను బహిష్కరించి ఆందోళన బాటపట్టనున్నారు. ఉపాధి హామీ పథకంలో 2006 సంవత్సరంలో డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం రాత పరీక్ష, నైపుణ్యత పరీక్ష ద్వారా ఉద్యోగులను నియమించారు. అయితే ఆనాటి నుంచి వరకు క్షేత్ర స్థాయిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించుకున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గ్రేడ్స్ ఫిక్స్ చేసే విషయంలో గత పదేళ్ళ నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయి. డ్వామా ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయడంతో పాటు పలు రకాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు వందలాది మంది రోడ్డుమీదకు వచ్చేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు. ప్రభుత్వం ఈ నాలుగు రోజుల్లో సమస్యలను పరిష్కరించని పక్షంలో సోమవారం నుంచి ఉద్యమాన్ని చేపట్టడం ద్వారా క్షేత్ర స్థాయిలో జరిగే ఉపాధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఉపాధి హామీలో భారీ అక్రమాలు

రూ.21.43 లక్షలు దుర్వినియోగం

ప్రజావేదికలో వెల్లడి

ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి నిర్ణయం


వివరాలు సేకరిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి, డీవీవో ఝాన్సీ, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీపీ కోటేశ్వరమ్మ

టంగుటూరు, ఫిబ్రవరి 27 : మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల పనిచేయకుండానే చేసినట్లు చూపి నిధులు బొక్కేశారు. మరి కొన్ని చోట్ల నాటినట్లు చూపిన మొక్కల ఆనవాళ్లు కన్పించలేదు. దీంతోపాటు ఇతరత్రా పలు పనుల్లో కలిపి రూ.21.43లక్షలు దుర్వినియోగం అయ్యాయి. ఈమేరకు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో వివరాలను అధికారులు వెల్లడించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 5.70కోట్ల మేర పనులు చేశారు. అయితే నాటిన మొక్కలు అడ్రస్ లేకుండా పోయినందుకు రూ.12లక్షలు, పనిచేయకుండానే చేసినట్లు చూపిన కారణంగా రూ.8లక్షలు. ఇతరత్రా రూ. 1,20లక్షలు 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రికవరీ చేయాలని నిర్ణయించారు. అవకతవకలకు సంబంధించి గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి మరో రూ.23,578 వసూలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అభియోగాలపై పూర్తి ఆధారాలు సేకరించాక రికవరీ నగదు తగ్గే అవకాశం ఉంది. మండలంలో జరిగిన అత్యధిక పనులకు ఈసీ చెక్‌మెజర్‌మెంట్ చేయలేదని గుర్తించారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత అధికారుల సంతకాలు లేకుండానే కూలి చెల్లింపు జరిగింది. అయితే సామాజిక తనిఖీ బృందాలు నీరున్న చెరువుల్లో కొలతలు తీసుకొని వ్యత్యాసాలు చూపినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ప్రజావేదికను చకచకా నడిపించారు. ఒక్కో గ్రామానికి 5నిమిషాలు మాత్రమే కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజావేదిక మమ అనిపించారని చెప్పవచ్చు. కార్యక్రమంలో డ్వామా పీడీ శీనారెడ్డి, విజిలెన్స్ విభాగం జిల్లా అధికారి ఝాన్సీ, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీపీ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన సీఐ

పీసీపల్లి, ఫిబ్రవరి 27 : కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇప్పటివరకు నమోదైన వివిధ కేసులకు సంబంధించిన వివరాలను ఎస్సై రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలని చెప్పారు. ఎన్నికలు ముగిసేవరకు ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా గ్రామాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు.

ఆర్‌బీకేల్లో వైఎస్సార్ సున్నావడ్డీ అర్హుల జాబితా


బొట్లగూడూరులో జొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రాధ

పామూరు, ఫిబ్రవరి 27 : బ్యాంకుల్లో లక్ష లోపు పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన రైతులకు వైఎస్సార్ సున్నావడ్డీకి సంబంధించిన అర్హులైన రైతుల జాబితాలను సంబంధిత ఆర్‌బీకే కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారిణి రాధ తెలిపారు. సకాలంలో పంట రుణాలు చెల్లించి జాబితాలో పేర్లు లేకపోతే సంబంధిత బ్యాంకులను సంప్రదించాలని ఆమె సూచించారు. అనంతరం బొట్లగూడూరులో జొన్న పంటను పరిశీలించారు.

ఆదుకోవటమే ఇస్కాన్ ముఖ్య సూత్రం

ఇస్కాన్ సభ్యులు డాక్టర్ సుబ్బారెడ్డి



టిఫిన్ బండితో పాటు రూ25వేలు అందించిన డాక్టర్ సుబ్బారెడ్డి, శ్రీధర్‌లు

కనిగిరి, ఫిబ్రవరి 27: ఆపదలో ఉన్న వారికి చేయూత అందించి ఆదుకోవటమే ఇస్కాన్‌లోని ముఖ్య సూత్రమని ఆ సంస్థ సభ్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, శ్రీధర్‌లు చెప్పారు. పట్టణంలోని గార్లపేటరోడ్డులోని ఇందిరాకాలనీకి చెందిన నారాయణ అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఆ ప్రాంతంలోని కొంతమంది సహచరుల సలహా మేరకు ఇస్కాన్ సంస్థను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఇస్కాన్ సభ్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, గుత్తి శ్రీధర్‌లు మంగళవారం నారాయణ కుటుంబానికి రూ.25వేలతోపాటు టిఫిన్ అమ్ముకునేందుకు బండిని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మాంటిసోరి పిచ్చిరెడ్డి, పసుపులేటి అరుణోదర్, సోమిశెట్టి శ్రీనివాసులు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఉమాకాంత్, బాబూరావు, ఆర్‌ఎంపీలు శేఖర్, తాళ్లూరు వెంకటేశ్వర్లు, మథర్ సేవాసమితి రసూల్, బొట్టు శ్రీనివాసులు, అచ్యుత వెంకటేశ్వర్లు, గురవయ్య పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సంపత్‌కుమార్

దొనకొండ, ఫిబ్రవరి 27 : వాహనదారులు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు జరుగుతాయని ఎస్సై సంపత్‌కుమార్ చెప్పారు. దొనకొండ అడ్డరోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వద్ద మంగళవారం వాహనాల తనిఖీ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ఆర్సీ, లైసెన్సు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు పరిశీలించి పలువురికి ఆన్‌లైన్ చలానాలు వేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ వాడటం వలన రక్షణగా ఉంటుందని, మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా సత్యనారాయణ


శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న సత్యనారాయణ

దర్శి ఫిబ్రవరి 27 : జిల్లా వైసీపీ ట్రేడ్ యూనియన్‌కార్యదర్శిగా, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జముకులదిన్నె సర్పంచ్ మర్రి సత్యనారాయణ యాదవ్ నియమితులయ్యారు. పార్టీ ఇచ్చిన ఉత్తర్వులను నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ఆయన మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ వైసీపీ పటిష్టతకు తమవంతు కృషి చేస్తామన్నారు.



పట్టాభిపురంలో ఒక పెట్రోలు బంకులో మూలనపడ్డ గాలిపంపు

ప్రమాణాలకు.. పాతర!



- పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు
- ఉచిత గాలి, తాగునీరు, ఫస్టెయిడ్ బాక్స్ సహా 6 సేవలు కల్పించాలి
- వాటిని ఏమాత్రం అమలు చేయని బంకు నిర్వాహకులు
- పర్యవేక్షణ, తనిఖీలు కొరవడడంతో నిబంధనలకు తిలోదకాలు
- వినియోగదారుల అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరిపే పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలు కూడా అందడం లేదు. ఇంధనాన్ని విక్రయించడమే కాదని, వినియోగదారులకు పలురకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసినా జిల్లాలో వాటిని పట్టించుకునేవారే లేరు. నిబంధన అమలుకు పూనుకోవాల్సిన అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో వున్న 300కు పైగా పెట్రోలు బంకుల్లో 90 శాతానికి పైగా పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.

టైర్లలో ఉచితంగా గాలి..

పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. చాలా బంకుల్లో వాటిని సక్రమంగా నిర్వహించడం లేదు. నూటికి 90 చోట్ల అవి పని చేయని స్థితిలోనే వున్నాయి. పనిచేస్తున్నా కొన్ని బంకుల్లో నిర్వాహకులు యంత్రం పని చేయడం లేదని, సిబ్బంది లేరని తప్పించుకుంటున్నారు. శివారు ప్రాంతాల్లోని బంకుల్లోకి లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు వస్తుంటాయి. వాటికి కూడా గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. మరికొంత మంది బలవంతగా డబ్బు వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి టైరుకు రూ.5, కార్లు, ఇతర భారీ వాహనాలకు రూ.10 వసూలు చేస్తున్నారు.

మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

ప్రతీ పెట్రోలు బంకులో మరుగుదొడ్లు అందుబాటు లో ఉంచాలి. చాలామంది బంకుల నిర్వాహకులు వాటిని నిర్వహించడం లేదు. చాలాచోట్ల మూత్రశాలల బోర్డులు పెట్టి సరిపుచ్చారు. ఒక వేళ మరుగుదొడ్లు వున్నా వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే పడివుంటున్నాయి. చాలాబంకుల్లో అవి సిబ్బంది కోసమే అన్నట్లు ఇతరులకు అనుమతించడం లేదు.

అవగాహనాలేమి.. అధికారుల బాధ్యత

పెట్రోల్‌బంకుల్లో విధిగా కల్పించాల్సిన సౌకర్యాలపై వినియోగదారులకు ఎవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాలు వినియోగదారులకు తెలిపేలా ప్రభుత్వంగానీ, సంబంధిత అధికారులుగానీ కనీస చర్యలు తీసుకోకపోవడంతో వినియోగదారులు తమకు హక్కుగా రావాల్సిన సౌకర్యాలను అన్నింటినీ కోల్పోతున్నారు. లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌కు వినియోగదారుడు పెట్రోల్ బంకుల వారికి 4 నుంచి 6 పైసలు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం పన్ను రూపంలో చెల్లిస్తున్నాడు. సగటున ఒక పెట్రోల్ బంకులో రోజుకు 10వేల లీటర్ల చమురు అమ్మితే టాయిలెట్స్ నిర్వహణ వ్యయం కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ.500 కంటే ఎక్కువే వుంటుంది. ఆ డబ్బుతో టాయిలెట్, మంచినీరు ఇతర సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత పెట్రోల్ బంకులదే.



గుంటూరు నగరంపాలెం లోని పెట్రోలు బంకులో పనిచేయని గాలిపంపు

తాగునీరు ఉండదు..

పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతి కూడా ఉండాలి. కానీ చాలా బంకుల్లో ఈ సౌకర్యం కల్పించడం లేదు. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగునీటి అవసరం ఎక్కువగా వుంటుంది. వాస్తవానికి బంకు నిర్వాహకుడు ఆర్వో యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. దాంతోపాటు ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదుల పెట్టె, లేదా రిజిస్టర్ వినియోగదారులకు అందుబాటులో వుంచాలి. పలు పెట్రోల్ బంకుల్లో కల్తీపెట్రోల్ అమ్ముతున్నారన్న ఫిర్యాదులు తరుచూ వినపడుతున్నా ఫిర్యాదుల పెట్టె లేకపోవడంతో వినియోగదా రులు ఆ సౌకర్యాన్ని వాడుకోలేకపోతున్నారు. దీంతోపాటు ఇంధన నాణ్యతను పరిశీలించుకునే సదుపాయాన్ని కూడా బంకులోనే అందుబాటులో వుంచాలి. వాటిని కూడా పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడంలేదు. వీటితోపాటు రోడ్డు ప్రమాదానికి గురైనవారికి అందుబాటులో ఉండేలా ప్రతి పెట్రోలు బంకులో ఒక ప్రథమ చికిత్స బాక్సు, ఒక టెలిఫోన్ వుంచాలి. కానీ ఇవేవీ పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడం లేదు.




హిందూ కాలేజీ సెంటర్లో మంచి నీటి సదుపాయం పరిస్థితి ఇది..

పర్యవేక్షణ, తనిఖీలేవి?

పెట్రోల్ బంకుల్లో సేవలపై సంబంధిత అధికారులు పెద్దగా పట్టించు కోవడం లేదు. తనిఖీలు కూడా చేయడం లేదు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత ఆటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవచ్చు. నిబంధనలు బేఖాతరు చేసేవారిపై జరిమానా విధించవచ్చు. బంకుల ను మూసివేయవచ్చు. కానీ గడిచిన ఐదేళ్లలో అలాంటి దాఖాలు మచ్చుకు కూడా లేవు.

మృతులకూ.. ఓట్లు



- తప్పుల తడకగా ఓటర్ల జాబితా
- ఫిర్యాదు చేసినా తొలగించని మృతుల ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు
- నియోజకవర్గంలో 307 డబుల్ ఎంట్రీ ఓట్లు

రేపల్లె, ఫిబ్రవరి 27: ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకగా మారింది. పారదర్శక ఓట్ల జాబితాను రూపొందించాలని ఎన్ని ఫిర్యాదులు అందినా పట్టించుకునే నాథుడే లేడు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం పంచాయతీలో 221, 222, 223 బూత్‌నెంబర్‌ల్లో పదుల సంఖ్యల్లో మృతుల ఓట్లు ఉన్నాయని, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు కలిగి ఉన్నారని ఫిర్యాదు చేసినా నేటికి తొలగించిన దాఖలాలు లేవు. ఓటర్ల జాబితాను ఆయా బూత్‌లను స్థానిక టీడీపీ నాయకులు పరిశీలించటంతో ఈ విషయం బయట పడింది. ఒకే ఓటర్లకు రెండు ఓట్ల చొప్పున పదిపైగానే ఉన్నాయి. మరణించిన వారి ఓట్లను తొలగించిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలో 307 ఓట్లు డబ్లింగ్ ఉన్నాయని, జీరో డోర్ నెంబరుతో 38ఓట్లు ఉన్నాయి. నేటికి వాటిని తొలగించిన దాఖలాలులేవు.

తప్పుల తడకలో ఓట్లు...

తూర్పుపాలెం పంచాయతీలో మృతిచెందిన వారికిఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో గుర్తించి ఫిర్యాదు చేసినా తుదిజాబితాలో తొలగించిన దాఖలాలు లేవు. ఓటర్ల లిస్టులను పరిశీలిస్తుంటే తవ్వే కొద్ది డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి ఓట్లు బయట పడుతున్నాయి. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం పంచాయతీలోని మత్తి నాగేశ్వరరావు (బూత్ నెం.222లో సీరియల్ నెం.91), పూషడపు సూర్యకాంతం (బూత్ నెం.223 సీరియల్ 37), పానుగంటి ఆంజనేయులు (బూత్ నెం.223, సీరియల్ నెం.212), పాలపర్తి పోలయ్య (బూత్ నెం.223, సీరియల్ నెం.523), బడే నాంచారమ్మ (బూత్ నెం.223, సీరియల్ నెం.569), ఆవుల పిచ్చియ్య (బూత్‌నెం.221లో సీరియల్ నెం.12), పూషడపు నాగమల్లేశ్వరరావు(బూత్‌నెం.221, సీరియల్ నెం. 100), చందు లక్ష్మీకుమారి (బూత్ నెం.221, సీరియల్ 408), చందనం నాగరత్నం (బూత్ నెం.221, సీరియల్ నెం.522), పూషడపు వెంకాయమ్మ (బూత్ నెం.221లో సీరియల్ నెం.606), పూషడపు సుబ్బారావు (బూత్ నెం.221, సీరియల్ నెం.799), మత్తి బ్రహ్మయ్య (221లో సీరియల్ నెం.797), మత్తి సీతామహాలక్ష్మి (బూత్ నెం.221, సీరియల్ నెం.825)... వీరంతా మృతి చెందారు. కానీ ఓటర్ల జాబితాలో నుంచి వీరి ఓట్లు తొలగించాలని కోరినా తొలగించిన దాఖలాలు లేవు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఈ విధంగా ఓట్లు ఉన్నాయి. తూర్పుపాలెంలో పూషడపు రఘురామ్ (223వ బూత్‌లో సీరియల్ నెం.45), 221వ బూత్‌లో 217సీరియల్ నెం.లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. అదే విధంగా బడే శివపార్వతి (223వ బూత్, సీరియల్ నెం.266), అదే బూత్‌లో సీరియల్ నెం.673లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. ఆళ్ళ సామ్రాజ్యం (223వ బూత్‌లో సీరియల్ నెం.89), 221వ బూత్‌లో 565 ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. మత్తి చిరంజీవి (బూత్‌నెం.222లో సీరియల్ నెం.168లో), అదే బూత్‌లో 628 సీరియల్ నెంబర్‌లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయి. బీఎల్‌వోలు నిర్లక్ష్యం కారణంగానే ఓటర్ల జాబితా అంతా తప్పుడు తడకగా మారింది. ఉన్నతాధికారులు దృష్టిసారించి ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి ఓట్లను తీసేసి ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న వారిని కూడా తొలగించాలని కోరారు.

వైసీపీ సభలా.. జాబ్‌మేళా

- అధికారుల కంటే.. పార్టీ నేతలే అధికం
- 950 మందికి 187 మంది మాత్రమే ఎంపిక

అద్దంకి, ఫిబ్రవరి 27: జాబ్‌మేళా కార్యక్రమం. నిరుద్యోగులు, పరిశ్రమల ప్రతినిధులు, ఇంటర్వ్యూలు నిర్వహించేవారితో హడావుడిగా ఉండాలి. కానీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళా వైసీపీ సభను తలపించింది. జాబ్‌మేళాకు ముఖ్యఅతిథిలుగా హాజరైన వారిలో అధికారుల కంటే వైసీపీ నాయకులే ఎక్కువగా ఉన్నారు. వీరిని



వైసీపీ రంగులతో ఉన్న వేదిక

చూసి నిరుద్యోగులు ఆశ్చర్యపోయారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉందని పెద్దఎత్తున ప్రచారం చేశారు. అయితే జాబ్‌మేళాకు పెద్ద కంపెనీలు హాజరుకాలేదు. పైగా 950 మందిని ఇంటర్వ్యూ చేసి 187 మందిని మాత్రమే ఎంపిక చేశారు. వారిలో మళ్లీ 92 మందిని చివరి రౌండ్ కోసం ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. దీనిపై యువకులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, మెప్మా సీపీఎం ఫణికుమారి, హారిక, శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాకినేని శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కొల్లా భువనేశ్వరి, బాజీవలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డినరీ చార్జీలు అమల్లోకి..

- ఎన్నికల వేళ రైళ్ల చార్జీల పునరుద్ధరణ
- గుంటూరు - విజయవాడ రూ.10కే టిక్కెట్
- రేపల్లెకు రూ.20, మాచర్ల టిక్కెట్ రూ.30 మాత్రమే

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సాధారణ రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తాయిలం ప్రకటించింది. కోవిడ్ తర్వాత పాసింజర్ రైళ్లను స్పెషల్ ట్రైన్సుగా నడుపుతూ మెయిల్/ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తూ వచ్చిన రైల్వే శాఖ పాత ఆర్డినరీ చార్జీలను పునరుద్ధరించింది. అయితే దక్షిణ మధ్య రైల్వే జోన్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు స్పెషల్ చార్జీలనే వసూలు చేశారు. ఆర్డినరీ చార్జీ ఆప్షన్‌ను యూటీఎస్ యాప్‌లో మంగళవారం నుంచి అందుబాటులోకి తీసు కొచ్చారు. ఈ నేపథ్యంలో చార్జీలను బుధ/గురు వారాల నుంచి అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రయాణికుల క్రమబద్ధీకరణ పేరుతో ఆర్డనరీ పాసింజర్ రైళ్లను ప్రత్యేక పాసింజర్‌గా రైల్వే శాఖ పట్టా లెక్కించింది. వాటిలో కనీస టిక్కెట్ ధర రూ.30గా నిర్ణయించి ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తున్నది. గుంటూరు నుంచి నల్లపాడు/పెదకాకాని /వేజండ్లకు వెళ్లాలన్నా రూ.30 చెల్లించాల్సి వచ్చేది. గుంటూరు నుంచి విజయవాడ, సత్తెన పల్లి, తెనాలికి రూ.30 వసూలు చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కనీస చార్జీ రూ.10(పాత చార్జీ)ని పున రుద్ధరించారు. రేపల్లెకు ప్రస్తుతం రూ.35 ఉన్న చార్జీ రూ.20కి తగ్గనుంది. నరసరావుపేటకు రూ.30 ఉన్న టిక్కెట్ రూ.15కి దిగి వస్తుంది. అలానే పిడుగురాళ్లకు రూ.45 ఉండగా ఇది రూ.20కి తగ్గుతుంది. నడికుడికి రూ.50 నుంచి రూ.25కి, మాచర్లకు రూ.60 నుంచి రూ.30కి తగ్గుతుంది. వినుకొండకు రూ.45 నుంచి రూ.25కు తగ్గుతుంది.



సర్క్యులర్ రాగానే అమలు

రైల్వేబోర్డు సర్క్యులర్‌ని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ విభాగం నుంచి తమకు అందగానే పాసింజర్ రైళ్లలో ఆర్డినరీ చార్జీల అమలుని ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి. మంగళవారం రైల్వేబోర్డు నుంచి సర్క్యులర్ జారీ అయినట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందని, అయితే ఆ ఉత్తర్వులు తమకు అధికారికంగా అందాల్సి ఉందని పేర్కొన్నాయి. అప్పటి వరకు స్పెషల్ పాసింజర్ చార్జీలే అమలులో ఉంటాయని స్పష్టం చేశాయి. కాగా ఎన్నికలకు నెల ముందు ఇలా పేదలకు గాలం వేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చార్జీలను తగ్గించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

నెలలోపే.. బదిలీ

- నాలుగు మున్సిపాలిటీలకు కొత్త కమిషనర్లు
- ఎన్నికల బదిలీల్లో ఇటీవలే వారి నియామకం
- ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టితోనే తాజా బదిలీలా?



బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సన్నద్ధత లో భాగంగా ఈసీ ఆదేశాలను అనుసరించి ప్రభుత్వం ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లను బదిలీ చేసింది. వారు బాధ్యతలు కూడా స్వీకరించారు. అయితే వారు సీట్లో కూర్చొని నెల కూడా దాటకుండానే ప్రభుత్వం మళ్లీ మార్చింది. ఫిబ్రవరి మొదటి వారంలో చేపట్టిన బదిలీల్లో చీరాల కమిషనర్ రామచంద్రారెడ్డిని బాపట్లకు, రేపల్లె కమిషనర్ విజయసారథిని చీరాలకు నియమించారు. రేపల్లెకు రాంభూపాల్‌రెడ్డి, అద్దంకికి రషీద్‌ను కమిషనర్లుగా నియమించింది. అయితే మంగళవారం మున్సిపల్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ నాలుగు మున్సిపాలిటీలకు కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా రేపల్లెకు శేషాద్రి, బాపట్లకు శ్రీకాంత్, చీరాలకు సింహాచలం, అద్దంకికి సత్యనారాయణను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్వర్వులు వెలువడ్డాయి. ఒకటి రెండు చోట్ల కాకుండా జిల్లాలో ఉన్న మొత్తం నాలుగు మున్సిపాలిటీల్లో కమిషనర్ల మార్పు ఒకేసారి జరగడం చర్చకు దారి తీసింది. అందునా ఈ బదిలీలు జరిగి నెల కూడా గడవక ముందే మళ్లీ కొత్త ముఖాలను నియమిస్తూ మున్సిపల్ విభాగం ఉత్తర్వులివ్వడం వెనక ఈసీ కన్నెర్ర చేయడమే కారణమనే ప్రచారం ఉంది. ఫిబ్రవరి మొదటి వారంలో చేపట్టిన బదిలీల్లో చాలావరకు రాజకీయ నేతల అండదండలతోనే జరిగాయిని ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసింది. దీంతో ఈసీ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. లోక్‌సభ పరిధిలో విధులు, లేదంటే ఉమ్మడి జిల్లా ప్రామాణికంగానే ప్రస్తుతం మార్పు జరిగిందనే వాదన ఉంది. అయితే ఈసీ ఆదేశాలతోనే మళ్లీ మార్పు నిర్ణయాలు జరుగుతున్నాయనేది సమాచారం. ఒక్క మున్సి పాలిటీ విభాగంలోనే కాకుండా గతంలో జరిగిన బదిలీల్లో చాలా మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రోజుకు మిగిలేది.. రూ.10 లక్షలే!

- సింహ భాగం ఖర్చులకే పోతోంది
- ఇసుక దందాలో అక్రమార్కుల వాదన
- అధికారులు పొంతనలేని సమాధానాలు



జాబ్ మేళాకు హాజరైన యువత

చీరాల, ఫిబ్రవరి 27: 'వివిధ రూపాల్లో సింహభాగం ఖర్చవుతుంది. ఇందులో మా స్థాయిలో చెల్లించాల్సిన చెల్లింపులు ఉంటాయి. అవి పోతే ఇక రోజుకు మాకంటూ మిగిలేది రూ.10 లక్షలే. మాకు ఇంకా ఎన్ని ఖర్చులు ఉంటాయో మీకు తెలీదు..' అని ఇసుక దందాలో వచ్చే ఆదాయంపై అక్రమార్కుల సమర్థన ఇది. మొత్తమ్మీద ఇసుక దందాను సమర్థించుకునేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తుండగా వారికి అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలంలో చినగంజాం, కడవకుదురు మధ్య ఆర్‌వోబీ సమీపంలో రైల్వే ట్రాక్‌కు తూర్పువైపున, మరికొన్ని చోట్ల ఇసుక దందా అందరికీ కనిపిస్తుంది. కానీ సంబంధిత అధికారులు మాత్రం దీనిని ఆపేందుకు కనీస ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఆంధ్రజ్యోతిలో ఇసుక దందా శీర్షికన కథనం ప్రచురితమైన మంగళవారం కూడా నాలుగు ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు, ట్రాక్టర్లు ఇసుక నింపుతూనే ఉన్నారంటే



టిప్పర్లకు ఇసుక నింపుతున్న ఎక్స్‌కవేటర్లు

వారి బరితెగింపు ఏమిటో అర్థమవుతుంది.

ఎటువంటి అనుమతులు లేకుండానే..

సాధారణంగా ఇసుక అక్రమార్కులు ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రభుత్వ గృహ నిర్మాణాలకు సంబంధించి ఇసుక తవ్వకాలకు రెవెన్యూ శాఖ పరంగా ప్రత్యేక అనుమతులు తీసుకుని ఇసుక దందా సాగిస్తుంటారు. కానీ ప్రస్తుతం అక్రమ తవ్వకాలు సాగిస్తున్న వారికి అలాంటి అనుమతులు కూడా లేవని సమాచారం. ఒకవేళ వారికి అనుమతులు ఉన్నాయనుకున్నా వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి భారీ గోతుల ఏర్పడేలా తవ్వకాలు సాగిస్తున్నా అధికారులకు పట్టకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ తవ్వకాలు చట్టవిరుద్ధమైనా. దీనికి సంబంధించి అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్తున్నారు. జగనన్న కాలనీలకు ఇసుక సరఫరా చేసేందుకు వారికి అనుమతులు ఉన్నాయని చినగంజాం ఎస్‌ఐ శ్రీనివాసరావు చెప్పారు. అయితే నిర్దీత సర్వే నెంబర్లలోనే తవ్వకాలు సాగుతున్నాయా అని అడగ్గా వాటికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో సమాచారం తీసుకోవాలని చెప్పారు. చినగంజాం, కడవకుదురు మధ్య ఆర్‌వోబీ సమీపంలో కానీ, ఇతర ప్రాంతాల్లో కాని ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు ఫణీంద్రబాబు చెప్పారు. ఆర్‌వోబీ సమీపంలో జరుగుతున్న అనధికారిక తవ్వకాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. నూతనంగా వచ్చాను.. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై చర్యలు తప్పవు.. పరిశీలించి చర్యలు చేపడతామని చీరాల ఎస్‌ఈబీ సీఐ కర్ణ తెలిపారు. ఇసుక దందాపై మైనింగ్ అధికారులను వివరణ అడిగేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా వారు స్పందించలేదు. ఇలా ఎవరికి వారు ఇసుక అక్రమాలపై తప్పించుకునే ధోరణిలో సమాధానాలు చెప్పడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వచ్చే నెల 3 వరకు కలెక్టర్ సెలవు

ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం నుంచి జనవరి 3వతేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన వ్యక్తిగత పనుల కోసం సెలవుపై కలెక్టర్ తన స్వగ్రామానికి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇన్‌చార్జీ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ వ్యవహరించనున్నారు. వచ్చేనెల 4న కలెక్టర్ దినేష్‌కుమార్ విధుల్లో చేరనున్నారు.

కనిగిరి, మార్కాపురం కమిషనర్ల బదిలీ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : జిల్లాలోని పలువురు మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు కార్పొరేషన్, మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేసిన క్రమంలో మార్కాపురం, కనిగిరి కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. తిరుపతిలో ఆడిట్ శాఖలో అసిస్టెంట్ అధికారిగా పనిచేస్తున్న ఈ.కిరణ్‌ను డిప్యుటేషన్‌పై మార్కాపురం కమిషనరుగా నియమించారు. అలాగే కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న డానియేల్ జోసఫ్‌ను ప్రొద్దుటూరు రెవెన్యూ అధికారిగా నియమించగా, గతంలో ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులై, వివిధ కారణాల చేత నిలిచిపోయిన టీవీ రంగారావును కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27 : జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీలు చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. మద్దిపాడులో పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లును రాచర్లకు, ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.డానియేలును వెలిగండ్లకు, హనుమంతునిపాడులో పనిచేస్తున్న ఎన్.రమాదేవిని ఒంగోలు ఆర్డీవో కార్యాలయ కేఆర్ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్‌గా, ఆర్డీవో కార్యాలయ కేఆర్ఆర్‌సీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.అనురాధను మద్దిపాడు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు సెల్‌ఫోన్‌ల అందజేత

అద్దంకి, ఫి బ్రవరి 27 : పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను బాధితులకు మంగళవారం సీఐ కృష్ణయ్య అందజేశారు. సుమారు 15రోజుల క్రితం మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన భానుప్రకాష్, మణికేశ్వరంకు చెందిన మందా తిమోతి అద్దంకి పట్టణంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసులు సెల్‌ఫోన్‌లను గుర్తించి మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ అభినందించారు.

నేడు దర్జీ దినోత్సవం

అద్దంకి, ఫిబ్రవరి 27: దర్జీ దినోత్సవం సందర్భంగా అద్దంకి పట్టణ, మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పోస్టాఫీస్ సమీపంలోని షాదీఖానాలో సమావేశం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య తెలిపారు. ఉదయం 9-30 గంటలకు ప్రసన్నాంజనేయ కాంప్లెక్స్ వద్ద జెండావిష్కరణ ఉంటుందని తెలిపారు.

29న మినీ జాబ్‌మేళా

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 27 : నిరుద్యోగ యువతీ యువకులు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఈపూరుపాలెం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఏ సత్తార్ తెలిపారు. ఈనెల 29న జరిగే మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటార్స్, స్కిల్ సో నిక్స్ కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు వరసిద్ధి వినాయకుడి ఆలయ ప్రతిష్ఠ

వైభవంగా గ్రామోత్సవం


వరసిద్ధి వినాయక విగ్రహం

బల్లికురవ. ఫిబ్రవరి 27 : బల్లికురవ గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకుడి దేవాలయ ప్రతిష్ఠ బుధవారం జరగనుంది. ప్రతిష్ఠ పూజలలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామస్థులు వినాయకుని విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు వినాయకుడికి వార్లు పోసి హారతులు ఇచ్చారు. ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. మేళా తాళాలతో ఊరేగింపు నిర్వహించటంతో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

అవినీతి అధికారులపై వేటు...!

ఇద్దరు సీఓలు, ఐదుగురు ఆర్పీలు సస్పెన్షన్

మెప్మాలో పలువురికి మెమోలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 27 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపులు సృష్టించి భారీగా రుణ దోపిడీకి పాల్పడిన పలువురు అధికారులపై వేటు పడింది. ఈ మేరకు వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు రుణాలు అందించగా, కొందరు ఆర్పీలు, సీఓలు, అధికారపార్టీ నేతలతో కలిసి నకిలీ గ్రూపులను సృష్టించి భారీగా దోచుకున్న వైనంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. ఈ మేరకు కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ, సివిల్ సప్లయీస్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్లు గత వారం ఆర్పీలు, సీఓలు, ఇతర సిబ్బందిని విచారించారు. దాంతోపాటుగా పలు బ్యాంకుల్లో విచారణ చేసి ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కాగా ఇందులో భాగస్వాములైన సీఎంఎం, ఐదురుగురు సీఓలకు మెమోలు జారీ చేయగా, మరో ఇద్దరు సీఓలు చాంద్‌బీ, నిర్మల, ఆర్పీలు ఏవీ.సుజాత, సలోమి, పి. సుజాత, జాన్సీరాణి, వాసవిలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా పీడీ టి.రవికుమార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రాథమిక విచారణలో పలువురిను గుర్తించి విధుల నుంచి తొలగించగా, కొందరికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, అయితే ఇప్పటికే అవినీతికి పాల్పడిన కొందరు ఆర్పీలు బోగస్ గ్రూపుల పేరుతో పొందిన రుణాలను తిరిగి చెల్లిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పూర్తి నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మికి అందజేస్తామని తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం

ప్రొటోకాల్ పాటించలేదని సర్పంచ్ ఆగ్రహం


శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న సర్పంచ్ రామాంజనేయరెడ్డి

పెద్దారవీడు (మార్కాపురం రూరల్), ఫిబ్రవరి 27: సచివాలయ భవనం శిలాఫలకంలో తన పేరు లేదని వైసీపీ మద్దతుదారు సర్పంచ్ దానిని ధ్వంసం చేశారు. ఈ ఘటన పెద్దారవీడు మండలం చట్లమిట్లలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలో నూతన సచివాలయాన్ని నిర్మించారు. దీన్ని ఎన్నికల కోడ్‌లోపు ప్రారంభించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ సచివాలయం గోడపై శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ సచివాలయం పరిధిలో చట్లమిట్లతోపాటు రేగుమానిపల్లి కూడా ఉంటుంది. అయితే అధికారులు మాత్రం చట్లమిట్ల పాలకవర్గం పేర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. రేగుమానిపల్లి సర్పంచ్, పాలకవర్గం పేర్లు రాయలేదు. దీంతో ఆగ్రహించిన రేగుమానుపల్లి సర్పంచ్ రామాంజనేయరెడ్డి ఆ సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాన్ని సుత్తితో ధ్వంసం చేశారు. సచివాలయ పరిధిలోని రెండు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు వార్డుసభ్యుల పేర్లను రాయకుండా కేవలం చట్లమిట్ల వారి పేర్లు మాత్రమే నమోదు చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ప్రోటోకాల్ పాటించి రెండు గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

సహకారంలో అవినీతి అనకొండ

జిల్లాలో పనిచేసింది కేవలం 45 రోజులే

ఈ కొద్దికాలంలోనే అనేక ఆరోపణలు

తనిఖీల పేరుతో సొసైటీలపై దాడులు

మహిళా ఉద్యోగులపై అసభ్య ప్రవర్తన

బాధిత ఉద్యోగి ఫిర్యాదుతో బదిలీ వేటు

సమగ్ర విచారణకు ఆదేశించిన కలెక్టర్

సహకార శాఖలో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఆ అధికారి అవినీతి, అక్రమాలకు అంతే లేదు. డిప్యూటీ రిజిస్ట్రారుగా ఎంపికకాగా, మొదట మార్కాపురం డివిజన్ సహకార శాఖాధికారిగా నియమించారు. అక్కడ నుంచి ఫారిన్ సర్వీసు కింద గుడూరు మునిసిపల్ కమిషనరుగా వెళ్లారు. అక్కడ ఆయన అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఏడాదిలోపే అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణలో అవన్నీ వాస్తవమని తేలడంతో ఆయనను సహకారశాఖకు సరెండర్ చేశారు. దీంతో పోస్టింగ్ కోసం నాలుగు నెలలు వేచి ఉన్న అతనిని గతేడాది డిసెంబరు 31న ఒంగోలు డీఎల్‌సీఓగా నియమించారు. ఈ ఏడాది జనవరి 1న బాధ్యతలు స్వీకరించాక తన ప్రతాపం చూపించసాగారు. తన కార్యాలయంలోని సిబ్బందిని వెంటబెట్టుకొని సొసైటీలపై దాడులకు శ్రీకారం చుట్టారు. మహిళా ఉద్యోగులను వేధించారు. ఓ బాధితురాలి ఫిర్యాదుతో ఆయనపై బదిలీ వేటు పడింది. పైగా అతని అక్రమాలకు కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆయనే తోట సాయినాథ్...!

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27 : తోట సాయినాథ్.. ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పనిచేసింది స్వల్ప కాలమే. ఆ తక్కువ సమయంలోనే భారీగా అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారు. ఓ ఫిర్యాదు నేపథ్యంలో బదిలీ వేటుపడిన సదరు అధికారి వ్యవహారంపై కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు కూడా ఆదేశించారు. విచారణాధికారులుగా జిల్లా సహకారాధికారి పి.రాజశేఖర్, వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చనలను నియమించారు.

డీఎల్‌సీఓ మరో ఐదుగురు సభ్యుల బృందం సొసైటీలలో తనిఖీ పేరుతో సాగించిన అకృత్యాలు, కేవలం డబ్బుల కోసం వారు సాగించిన దుశ్చర్యలపై విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. సొసైటీలో ఒక మహిళా ఉద్యోగి పట్ల ఆ అధికారి, ఆయన బృందం అసభ్య ప్రవర్తనపై కూడా విచారణ నిర్వహించనున్నారు. ఒంగోలు డిప్యూటీ రిజిస్ట్రారుగా పనిచేసిన ఆ అధికారిపై సహకార శాఖ కమిషనర్ కార్యాలయానికి సైతం ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆ అధికారి అవినీతి, అక్రమాలపై సహకార శాఖ కమిషనర్ డీసీఓను నివేదిక కోరారు. వేధింపులకు గురైన ఆ మహిళా ఉద్యోగి సహకారశాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శికి, సీఎంఓకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో కమిషన్ ఆ అవినీతి అధికారిపై బదిలీ వేటు వేశారు. దీంతో ఆయన రాజమండ్రిలోని సహకార శిక్షణ కళాశాలకు బదిలీ అయ్యారు. జిల్లా సహకార శాఖ చరిత్రలో ఒంగోలు డివిజన్‌లో కేవలం 45 రోజుల కాలంలో అనేక అవినీతి, అక్రమాలతో బదిలీ అయిన అధికారి ఈయనే.

తనిఖీల పేరుతో స్వైరవిహారం

సొసైటీల తనిఖీల పేరుతో ఆ అధికారి, ఆయన బృందం వీరవిహారం చేసింది. సొసైటీలకు వెళ్లి రికార్డులు పరిశీలించి ఏదైనా చిన్న తప్పు దొరికినా దానిని సాకుగా చూపి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్యంగా తిట్టడం పరిపాటిగా మారింది. ఒక సొసైటీలో అక్కడి సీఈఓ అన్ని రికార్డులు చూపించారు. తీర్మానాల పుస్తకం మాత్రం సొసైటీ అధ్యక్షుని సంతకం చేయించేందుకు ఇంటి వద్ద ఉంచారు. అయితే ఆ పుస్తకం చూపించమంటూ ఆ సీఈఓను ఒక ఖైదీలా తమ వాహనంలో ఎక్కించుకుని ఇంటికి తీసుకు వెళ్ళి కుటుంబ సభ్యుల సమక్షంలో పెద్దపెద్దగా రంకెలు వేస్తూ బండబూతులు తిట్టారు. దీంతో ఆ వీధిలోని వారందరూ గుమికూడగా కుటుంబసభ్యులు రోధించారు. ఈ అవమానం తట్టుకోలేని ఆ సీఈఓ ఆత్మహత్యకు సిద్ధపడగా అందరూ వారించిరు. సొసైటీల రికార్డులను బలవంతంగా సీజ్ చేసి కార్యాలయానికి తెచ్చి బేరసారాలకు తెరలేపారు. సొసైటీలో తప్పులు జరిగాయని విచారణకు సిఫార్సు చేస్తే ఇరుక్కుపోతారని పీఏసీఎస్‌ల సిబ్బందిని బెదిరించి బలవంతంగా భారీమొత్తంలో వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. సొసైటీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు కనీసం రసీదులు కూడా ఇవ్వకుండా బలవంతంగా రికార్డులు ఎత్తుకుపోతుండటంతో అవి ఏమవుతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని కొత్తపట్నం, చిమట, దొడ్డవరం, పసుపుగల్లు, ఉమామహేశ్వరపురం, బొప్పూడివారిపాలెం, కూనంనేనివారిపాలెం, చీమకుర్తితో పాటు మరో ఎనిమిది సొసైటీలను అధికారి ఆయన బృందం తనిఖీలు చేశారు. వారు అడిగినంత ఇస్తేనే రికార్డులు ఇస్తామంటూ లక్షలాది రూపాయలను బలవంతంగా వసూలు చేశారు. పీడీసీసీ బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది కొందరిపైన కూడా ఆ అధికారి తన ప్రతాపం చూపించారు. దీంతో బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి ఆ అధికారిపై డీసీఓకు ఫిర్యాదు చేశారు. కొన్ని సొసైటీల అధ్యక్షులు కూడా ఆ అధికారిపై డీసీఓకు, సహకార శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు,

కలెక్టర్ ఆగ్రహం.. విచారణకు ఆదేశం

ఒంగోలు డివిజనల్ సహకారశాఖాధికారి తీరు, ఆయన నిర్వాహకాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారి తనిఖీల పేరుతో నిర్వహిస్తున్న దందాలు, అక్రమ వసూళ్లు, అకృత్యాలపై మండిపడ్డారు. ఇంతగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిని కేవలం బదిలీతోనే సరిపెట్టడం సరికాదు, బదిలీ శిక్ష అవుతుందా, తప్పు చేసిన వారిని తప్పనిసరిగా శిక్షించాలని ఆ అధికారి అతని బృందంపై కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. ఆ అధికారి మాతృశాఖలో మాత్రం చలనం లేదు. అనేక ఫిర్యాదులు నేరుగా ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అందినా, డీసీఓ ప్రాథమిక నివేదిక సమర్పించినా ఆ అధికారులు పట్టించుకోలేదు. ఇన్ని తప్పులు చేసిన ఆ అధికారిని కేవలం బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారు. సహకారశాఖలో ఆ అధికారికి ఉన్న పలుకుబడి, ఉన్నతాధికారులతో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని సహకారశాఖ ఉద్యోగులు గుసుగుసలాడుకుంటున్నారు. కాగా ఈ విషయమై డీసీఓ పి.రాజశేఖర్‌ను వివరణ కోరగా డీఎల్‌సీఓ తోట సాయినాథ్ అక్రమాలపై కలెక్టర్ విచారణకు ఆదేశించిన మాట వాస్తవమేనన్నారు.


జిల్లా సహకారాధికారి కార్యాలయం

మహిళా ఉద్యోగిపై వేధింపులు

ముండ్లమూరు మండలం ఓ సొసైటీ సందర్శన సందర్భంగా అక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల పట్ల ఆ అధికారి అసభ్యకరంగా ప్రవర్తించారు. ద్వంద్వ అర్థాలతో మాట్లాడుతూ ఆమెను ఇబ్బందిపెట్టారు. ఆమె వారించబోతే మరింతగా రెచ్చిపోయారు. సొసైటీ తనిఖీ పేరుతో రికార్డులతోపాటు ఆ ఉద్యోగి సర్వీసు రిజిస్టరు తెచ్చి ఆమెను ఇబ్బందిపెట్టారు. ఆమె సంగతి తనకు తెలుసంటూ సెటైర్లు వేస్తూ అవమానించారు. ఎస్ఆర్ కోసం ఒంగోలులోని కార్యాలయానికి వస్తే ఆ అధికారి బృదంలోని సిబ్బంది ఒకరు అక్కడ కూడా ఆమెను వదలకుండా వేధింపులకు గురిచేశారు ఈ వేధింపులు తాళలేక ఆమె సహకార శాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈనెల 15న ఆమె ఫిర్యాదు చేయగా అదే రోజు ఆ అధికారిపై బదిలీ వేటు వేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

వేడెక్కిన రాజకీయం

తాడేపల్లి మీటింగ్‌కు మహీధర్, మద్దిశెట్టి గైర్హాజరు

ఆమంచికి అందని ఆహ్వానం

29న మాగుంట రాజీనామా

కందుకూరులో వైసీపీ తరఫున బుర్రా!

నోటిఫికేషన్ లోపే జడ్పీ చైర్‌పర్సన్ మార్పు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు పలువురు ప్రముఖులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పార్టీ దూరంగా పెట్టిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీలో చేరేందుకు సిద్ధం కాగా తాజాగా దర్శి, కందుకూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, మానుగుంట మహీధరరెడ్డిలు వైసీపీకి దూరమయ్యారు. ఇంకోవైపు కొత్తగా ఆ పార్టీ రంగంలోకి దింపుతున్న అభ్యర్థులు ఒక్కొక్కరు జారిపోతున్నారు. కందుకూరు నుంచి రంగంలో దించాలని భావించిన అరవిందయాదవ్ పోటీకి విముఖత చూపటంతో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను వైసీపీ రంగంలోకి తెచ్చింది. ఆ మేరకు తాడేపల్లిలో మంగళవారం సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరో ఒకరిద్దరు ఇన్‌చార్జిల మార్పు జరగవచ్చన్న ఊహాగానాలు వైసీపీ నేతల్లో ప్రారంభం కాగా అందుకు ఏమాత్రం అవకాశం లేదన్న సంకేతాన్ని అధిష్ఠానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల ఎంపికలో దూకుడును ప్రదర్శించిన వైసీపీకి మొదటి నుంచి ఎదురవుతున్న సమస్యలు ముదిరి పాకానపడుతున్నాయి. మంగళవారం తాడేపల్లిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, రీజనల్ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పోటీలో ఉన్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. అయితే సమావేశానికి ఎమ్మెల్యేలు వేణుగోపాల్, మహీధరరెడ్డిలు హాజరుకాలేదు. వారి సమావేశంలో ప్రస్తుతం ప్రకటించిన ఇన్‌చార్జిలే కాబోయే అభ్యర్థులని స్పష్టం చేసిన జగన్ అందుకు కొద్ది సమయం ముందే కందుకూరు ఇన్‌చార్జిని మార్పుచేశారు. దీంతో మరో ఒకటి అరా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉండవచ్చన్న ప్రచారం ప్రారంభమైంది.

29న మాగుంట రాజీనామా

ఒంగోలు ఎంపీ మాగుంట ఈనెల 29వతేదీ వైసీపీకి రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. కొంతకాలంగా జగన్ ఆయన్ను దూరంగా పెట్టడం, ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా చెవిరెడ్డిని అందరికీ పరిచయం చేయటం, పార్టీ కార్యక్రమాలకు మాగుంటను ఆహ్వానించకపోవటం తెలిసిందే. దీంతో మాగుంట తర్జనభర్జనల అనంతరం ప్రత్యామ్నాయం వైపు దృష్టిసారించారు. టీడీపీ అధిష్ఠానం ఆయనకు స్నేహహస్తం అందించింది. మంగళవారం ఒంగోలు వచ్చిన మాగుంట తన కార్యాలయంలో కుమారుడు రాఘవరెడ్డి నిర్వహిస్తున్న ప్రత్యేక హోమాలు, ఇతర కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యమధ్యలో అనుచరులతో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం వరకు ఈ ప్రత్యేక హోమాలు జరుగుతాయి. ఎన్నికల సమయం దగ్గరపడటం, టీడీపీ జనసేన కూటమి నుంచి ఒత్తిడి పెరగటంతో అనుచరుల సూచన మేరకు ఆయన వైసీపీకి గుడ్‌బై చెప్పాలన్న నిర్ణయానికి వచ్చేశారు. గురువారం ఆయన అధికారికంగా వైసీపీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. శనివారం నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డితోపాటు మరికొందరు టీడీపీలో చేరనున్నారు. అదేరోజు మాగుంట టీడీపీలో చేరతారా లేదా అన్నది స్పష్టత లేదు. అయితే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమాలకు జిల్లాకు రానున్నారు. వాస్తవానికి ఆయన శుక్రవారమే జిల్లాకు రావాల్సి ఉంది. అయితే మాగుంట చేరిక అనంతరం రావాలన్న ఉద్దేశంతో 3వ తేదీ తర్వాత జిల్లాకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈలోపు మాగుంట కుటుంబం ఒంగోలు లోక్‌సభ పరిధిలోని ఆయన అనుచరులు తెలుగుదేశంలో చేరే ప్రక్రియ పూర్తికావచ్చని భావిస్తున్నారు.

మహీధర్, వేణుగోపాల్ దూరమైనట్లే

ఎమ్మెల్యేలు వేణుగోపాల్, మహీధరరెడ్డిలు కూడా వైసీపీకి దూరమైనట్లే భావిస్తున్నారు. ఒంగోలుకు సీఎం వచ్చిన రోజు కూడా మద్దిశెట్టి హాజరుకాలేదు. మంగళవారం తాడేపల్లి సమావేశానికీ గైర్హాజరయ్యారు. ఇటీవల ఆయన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను కలిసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఏదైనా పార్టీలో చేరతారా ఎక్కడి నుంచైనా పోటీకి రంగంలోకి వస్తారా అనేది ఖరారు కానప్పటికీ దర్శిలో వైసీపీ అభ్యర్థికి సహకరించ కూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా మంగళవారం తాడేపల్లి సమావేశానికి వెళ్లలేదు. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి పంపిన పార్టీ ప్రచార సామగ్రిని కూడా ఆయన తీసుకోకుండా వెనక్కు పంపించారు. తన భవిష్యత్తు రాజకీయ వ్యవహారంపై గుంభనంగా ఆయన వ్యవహరిస్తున్నప్పటికీ వైసీపీకి సహకరించబోడని తేటతెల్లమవుతోంది.

ఇన్‌చార్జిలే ఫైనల్

కాగా మంగళవారం తాడేపల్లిలో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రకటించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలను మార్పుచేసిన నియోజకవర్గాల్లో మార్పులు ఉంటాయని ఆశించవద్దని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఒకటి రెండు చోట్లనే అలాంటి అవకాశం ఉందని తేల్చిచెప్పారు. తదనుగుణంగానే కందుకూరు మార్పు జరిగినందున పర్చూరు ఇన్‌చార్జి మార్పుపై అనుమానాలు పెరిగాయి. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను మార్చి అక్కడ బాలాజీని నియమించారు. చీరాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆమంచి రంగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ఒకటి అరా మార్పులు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్న అనుమానాలు వైసీపీ నేతల్లో వినిపిస్తున్నాయి.

ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

- శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్
- అశోక్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలి
- గిద్దలూరులో ముస్లింల ఆత్మీయ సమావేశం
- భారీగా హాజరైన మైనారిటీలు


మాట్లాడుతున్న షరీఫ్, పక్కన అశోక్‌రెడ్డి


హాజరైన ముస్లింయువతీయువకులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్‌షరీఫ్ అన్నారు. మంగళవారం గిద్దలూరు పట్టణంలోని షాదీఖానాలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధి ప్రాధాన్యతను ఇచ్చి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచిన నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన జగన్ మైనారిటీల సంక్షేమాన్ని మరచి వారిపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ముస్లింలపై వైసీపీ మూకలు దాడి చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అరాచక పాలనను తరిమి కొట్టడానికి ముస్లింలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు మౌలానిముస్తక్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో దోపిడీ ప్రభుత్వం నడుస్తోందన్నారు. జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని ముస్లింలకు విజ్ఞప్తి చేశారు. ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను శాసనసభ్యునిగా ఉన్న కాలంలో ముస్లింల సంక్షేమానికి కృషిచేశానన్నారు. షాదీఖానాల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లింలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా బలపరచిన తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, ముస్లిం నాయకులు పెద్దభాషా, మస్తాన్ పాల్గొన్నారు.

హెచ్ఎం అకౌంట్ టెస్ట్ దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 27: హెచ్ఎం అకౌంట్ టెస్ట్ దరఖాస్తు గడువును మార్చి 4వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ కె.శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.60 రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించి 7వ తేదీలోపు దరఖాస్తు ప్రింట్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. మార్చి 3న జరగనున్న ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్‌కు సంబంధించి హాల్‌టికెట్లను అభ్యర్థులు ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

పంటలపై దుమ్ము..ధూళి..!



మొక్కజొన్నను మింగేసిన దుమ్ము

- ఎదుగుదల లేక..ఎండిపోతున్న పైర్లు
- బల్లికురవ-మార్టూరు అర్అండ్ రోడ్డులో కాలుష్య ముప్పు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా రోడ్డు
- లక్షలు పెట్టుబడిపెట్టినా పండడంలేదని రైతుల ఆందోళన





దుమ్ము ఎగిసి పడుతుండడంతో ఎదుగదలలేని మిర్చి.. పొగాకుపై పేరుకుపోయిన ధూళి



గ్రానైట్ లారీల తాకిడికి లేస్తున్న దుమ్ము

బల్లికురవ. ఫిబ్రవరి 27 : రోడ్ల నుంచి వస్తున్న విపరీతమైన దుమ్ము ధూళి ప్రభావం వాహనచోదకులతో పాటు పంటలపై పెను ప్రభావం చూపుతోంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు రోడ్ల వెంట ఉన్న పొలాల్లో పండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల తాకిడితో ఎగిసిపడుతున్న దుమ్ముతో పంటలు ఎదుగదల లేకుండా పోతున్నాయని రైతులు చెప్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను మరమ్మతులు చేసిన పాపానపోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రోడ్ల మర్మతులు చేపడితే తాము పంటలు సాగు చేసుకునే వీలు ఉండేదని ఇప్పుడు పంటలు సాగు చేయాలంటేనే భయమేస్తుందని కొందరు రైతులు వాపోతున్నారు.

బల్లికురవ - మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులో నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై మట్టిరోడ్డులా మారింది. ఈ రోడ్డులో ముందు వాహనం వెళితే వెనుక వచ్చేవారు దుమ్ములో కనిపించని పరిస్థితి ఉంది. దీనినిచూస్తే ఇక్కడ ఏ స్థాయిలో దుమ్ము లేస్తోందో అర్థమవుతోంది. ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పాలకులు చెప్తున్నా ఎక్కడా తట్టెడు మట్టిని పోయలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, రాత్రి గ్రానైట్ లారీలు వెళ్తుండడంతో దుమ్ములేచి కష్టపడి, పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్నా పంటలు పండడం లేదని వారు కంటతడి పెడుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్డు కిరువైపులా నక్కబొక్కలపాడు, మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతు లు మొక్కజొన్న, మిర్చి, కంది, పొగాకు, కూరగాయాల పంటలను బోరు బావులు, వర్షాధారంగా పంటలు సాగు చేశారు. రోడ్డు నుంచి వస్తున్న దుమ్ముతో ఎదుగుదల లేకుండానే ఎండిపోతున్నాయి. రైతులు పలు మార్లు తాము పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలపై తెల్లటి దుమ్ము పేరుకు పోయిందని మిర్చి పంట అయితే పెరగకుండానే ఎండిపోతుందని కాలుష్య ప్రభావం ఇలా ఉంటే కనీసం నీటిని కూడా రోడ్డుకు చెల్లించడంలేదని రైతులు అరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రోడ్డు ఇలానే ఉంటే ఇరువైపులా ఉన్న పొలాలు బీడులుగా మారే ప్రమాదం పొంచి ఉందని రైతులు తెలిపారు. గ్రానైట్ లారీలు వెళ్లిన సమయంలో లేస్తున్న దుమ్ముతో పంట పొలాల్లో ఉన్న రైతులు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారని, కూలీలు పనులకు కూడా రావడం లేదని రైతులు తెలిపారు. పంట దిగుబడులు అరకొరగా వచ్చిన దుమ్ము ఉండడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. సుమారు వంద ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేశామని దుమ్ము ప్రభావం ఈ పంటలపై ఉందని రైతులు తెలిపారు. గత నెలలో పెద్ద పెద్ద గోతులు రోడ్డులో ఉండడంతో నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య గోతులు చదరం చేయించారని ఇప్పుడు గ్రానైట్ వాహనాలు వేగంగా పోతున్నాయని దీంతో మరింత దుమ్ము పెరిగిందని రైతులు తెలిపారు. ఇదే రోడ్డులో ఉన్న నక్కబొక్కలపాడుతోపాటు ఎస్సీ కాలనీకి కూడా దుమ్ము ప్రభావం అధికంగా ఉందని ప్రజలు డస్ట్ అలర్జీలబారిన పడుతున్నారని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే బల్లికురవ - మార్టురు అర్ అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏ పంట వేసినా దుమ్ముతో నష్టపోతున్నాం



నాకు బల్లికురవ-మార్టూరు అర్ అండ్‌బీ రోడ్డు పక్కనే పొలం ఉంది. రోడ్డు మర్మతులు లేకపోవడంతో వాహనాలు వెళ్లివచ్చేసమయంలో పెద్ద ఎత్తున దుమ్ము..ధూళి లేచి పొలాలమీదికి వస్తోంది. దీంతో ఏ పంట సాగు చేసినా పండడం లేదు. తీవ్రంగా నష్టాలు వస్తున్నాయి. అయిదేళ్ల కాలంలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టిని కూడా వేసిన పాపాన పోలేదు. వైసీపీ పాలకులు రోడ్లను పట్టించుకోవడం లేదు. రోడ్డు ప్రక్కన సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డును అభివృద్ధి చేయాలి.

- ధూళిపాళ్ల పూర్ణయ్య, రైతు, నక్కబొక్కలపాడు

చెన్నుడిని తాకిన ఆదిత్య కిరణాలు

అద్భుత దృశ్యాన్ని చూసి తరించిన భక్తులు



స్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

పంగులూరు, ఫిబ్రవరి 27 : మండలంలోని చందలూరు గ్రామంలోని శ్రీ భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకాయి. ఈ అద్భుత ఘట్టం మంగళవారం ఉదయం ఆవిష్కృతమైంది. ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి 6 గంటల 50 నిముషాల వరకు సూర్యకిరణాలు స్వామి వారిని స్పృశించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని పలువురు భక్తులు చూసి తరించారు. ప్రతి ఏటా సౌరమానాన్ని అనుసరించి ఉత్తరాయణం, కుంభ సంక్రమణం, శతభిషం కార్తెలో ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిమిషాల వరకు, దక్షిణాయణం కన్యా సంక్రమణం, చిత్తకార్తెలో అక్టోబరు 14, 15 తేదీలలో ఉదయం 6 గంటల 5 నిముషాల నుంచి 6 గంటల 25 నిమిషాల వరకు సూర్యకిరణాలు ఆలయ మూలవిరాట్ ఆవిష్కరించడం జరుగుతుందని అర్చకస్వామి పర్చూరు రఘునాథాచార్యులు తెలిపారు.

క్రీడా సంఘాలకూ వైసీపీ పీడ..!

ఎమ్మెల్యే గొట్టిపాటి



అద్దంకి, ఫిబ్రవరి 27 : చివరకు క్రీడాకారులకు, క్రీడా సంఘాలకు కూడా వైసీపీ రాజకీయ పీడ పట్టిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రకటనలో ఆం దోళన వ్యక్తం చేశారు. భారతదేశం తరఫున పలు టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన అంతర్జాతీయ క్రికెటర్ హనుమ విహారీ తిరుపతిలోని వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్ దెబ్బకు రంజీ జట్టు కెప్టెన్సీని కోల్పోయారన్నారు. తీవ్ర అవమాన భారంతో ఏకంగా విహారీ జట్టు వదిలివెళ్లి పోయేలా వైసీపీ వారు మనోవేదనకు గురిచేశా రని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రా జకీయ ఒత్తిడికి గురై రాష్ట్రానికి ప్రతిష్ట తెచ్చే విహారీ పట్ల అనుసరించిన విధానం సరైనది కాదని క్రికెట్ అభిమానులందరూ వ్యాఖ్యానిస్తున్నారన్నారని గొట్టిపాటి తెలియజేశారు. జగన్‌రెడ్డి పాలన క్రీడా వ్యవస్థను సైతం నీరుగారుస్తోందన్నారు. రాను న్న ఎన్నికలలో లబ్ధి పొందేందుకు ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రచార ఆర్భాటం చేశారన్నారు. జగన్‌రెడ్డి క్రీడాకారుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని, ఆంధ్రా ప్రతిష్ఠను దిగజార్చుతున్నారన్నారు. మేటి క్రీడాకారులను పొరుగు రాష్ట్రాలకు, పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విహారీని పొరుగు రాష్ట్రానికి పారిపోయేలా అనుచిత చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. హనుమ విహారీపై ఇష్టారీతిన మాట్లాడిన వైసీపీ నాయకులు తక్షణమే క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని ఇవ్వాలని గొట్టిపాటి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

టీపీడబ్ల్యూ నూతన కమిటీ

పర్చూరు, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం పార్టీకి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వెన్నుదన్నుగా నిలవాలని బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పర్చూరు నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ నూతన కమిటీని ఆయన ప్రకటించారు. ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సాంకేతిక పరంగా పార్టీకి అండదండలు ఉండాని కోరారు. పర్చూరు నియోజకవర్గ అధ్యక్షునిగా వెంపరాల జితేంద్ర పవన్ చింపపల్లిపాడు, ప్రధాన కార్యదర్శులుగా యాగంటి రాఘవ (దర్శి), వంకాలయపాటి వెంకటసుబ్బయ్య (స్వర్ణ), చింతలిప్పుల సుమంత్ (బొబ్బేపల్లి), బాచిన తిరుపతయ్య(నక్కలపాలెం), ఇరుపునేని రాము (పూనూరు), కొల్లా వెంకట్ నాగ అఖీత్ (నాగులపాలెం), పొద శ్రీరామ చంద్రమూర్తి (గొనసపూడి), ఆదిపూడి రవికుమార్ (ఎర్రంవారిపాలెం).



జితేంద్ర పవన్

టీడీపీ మండల ఉపాధ్యక్షునిగా రామకృష్ణ



మార్టూరు, ఫిబ్రవరి 27: టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా మార్టూరు గ్రామానికి చెందిన దురిశాల రామకృష్ణను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు నియామకపత్రాన్ని మంగళవారం రామకృష్ణకు అందజేశారు. పార్టీకి రామకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి పదవిని కట్టబెట్టారని నాగేశ్వరరావు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన ఏలూరికి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ఇంకొల్లు, ఫిబ్రవరి 27 : విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివితే ఉన్న శిఖరాలను అధిరోహిస్తారని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ జయలక్ష్మి అన్నారు. ఆదర్శ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మాస్టర్స్ ఐబీటీ పరీక్షను నిర్వహించారు. దీనిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. పోటీతత్వంతో ముందుకు సాగాలని, బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తో టకూర విజయభాస్కర్, బ్యాంక్ ఉద్యోగి విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవాణా సమస్య తలెత్తకుండా చర్యలు

సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ జిందాల్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

మేదరమెట్ల , ఫిబ్రవరి 27 : సిద్ధం సభకు వచ్చే ప్రజలకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు ఎటువంటి ఆసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు వద్ద ముఖ్యమంత్రి నిర్వహించే సిద్ధం సభ ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులతో కలిసి పరిశీలించారు. జిందాల్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుం డా జాతీయ రహదారికి ఇరువైపులా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణం వద్ద హెలిప్యాడ్‌ను తలసిల రఘురాంతో కలిసి ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ మహేష్, చీ రాల డీఎస్పీ ఎస్.ప్రసాద్‌రావు, రే పల్లె డీఎస్పీ టీ మురళీకృష్ణ, బా పట్ల డీఎస్పీ మురళీకృష్ణ, క్రైం డీ ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ, ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావు, అద్దంకి రూరల్, టౌన్ సీ ఐలు ఏ. శివరామకృష్ణరెడ్డి, కృష్ణ య్యా, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా సిద్ధం సభ వాయిదా పడినట్లు తెలిసింది. మార్చి 3కు బదులు 10న జరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక వైసీపీ నాయకులకు సమాచారం అందినట్లు తెలిపారు.

అహంకార వైసీపీని సాగనంపుదాం

- టీడీపీ జనసేన ఉమ్మడి సభను విజయవంతం చేయండి
- పోస్టర్ ఆవిష్కరణలో నేతల పిలుపు



చలో తాడేపల్లిగూడెం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ, జన సేన పార్టీ నాయకులు

పర్చూరు, ఫిబ్రవరి 27 : తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, శ్రేణులు కలిసి పని చేసి అహంకార, నిరంకుశ వైసీపీని సాగనంపాలని ఉభయ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. నేడు చలో తాడేపల్లిగూడెం బహిరంగ సభకు సంబంధించి మంగళవారం జనసేన ఆధ్వర్యంలో పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలసి పనిచేసిన ఆంధ్రప్రదేశ్‌లో సురక్షిత ప్రజాస్వామ్యం కోసం పోరాడి రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దింపాలన్నారు. ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఐక్యను చాటిచెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చేందుకు జగన్‌రెడ్డి పార్టీ మధ్య చిచ్చులేపే కుట్రలను అందరూ తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కారంపూడి సందీప్‌తేజ, కరారి సురేంద్ర, తులసి సునీల్ కుమార్ (చంటి), జట్టి హరి, తోట మణి, శీలం కుమార్, అచ్చుకోలు సతీష్, కందా సురేంద్ర, పసుపులేటి రవి, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కోడూరి శేషబ్రహ్మాచారి, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, కొల్లా శివరాంప్రసాద్, దాసరి రాము, శ్రీరాం వెంకటసుబ్బారావు, మామిడిపాక హరిప్రసాద్, తంగెళ్ల మల్లికార్జునరావు, చింపయ్య, కోట వెంకటేశ్వర్లు, నూతలపాటి హిజ్కాయిల్, షేక్‌బాషి పాల్గొన్నారు.

కమిషనర్‌గా సత్యనారాయణ

అద్దంకి, ఫిబ్రవరి 27 : అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణ ను నియమించారు. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా ఫిబ్రవరి 1వ తేదీన బాధ్యతలు తీసుకున్న అబ్దుల్ రషీద్ నెల రోజులు తిరగకుం డానే బదిలీ అయ్యారు. కాకినాడ అర్బన్ డెవలెప్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న సత్యనారాయణను అద్దంకి కమిషనర్‌గా నియ మించారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

చీరాల, ఫిబ్రవరి 27 : ఇటీవల చీరాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయసారథి మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన చీరాల నుంచి పాలకొల్లు మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడకు పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీ సింహాచలంను బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న పార్థసారధిని, అటెండర్ నుంచి అంచలంచెలుగా ఎదిగి బిల్ కలెక్టర్‌గా ఈనెల 29న రిటైర్డ్ అవుతున్న టి.చెన్నయ్యను కార్యాలయ, అవుట్‌డోర్ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వారికి అభినందనలు తెలిపారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- ఇంటికి అరకిలోమీటర్ లోపే డ్యూటీ చేస్తున్నవైనం
- రూ.2లక్షల సొత్తు మాయం



ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్ఐ సైదా

మార్టూరు, ఫిబ్రవరి 27 : రాత్రి డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ ఇంట్లో దొంగలు లూటీ చేశారు. దాదాపుగా రెండున్నర లక్షలకు పైగా విలువైన 4 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు వెండి వస్తువులు, రూ.9వేల నగదును దొంగలు ఎత్తుకు పోయారు. మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవర్‌కు తూర్పువైపున సర్వీసు రోడ్డుపక్క ఉన్న కాలనీలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. చోరీ జరిగిన ఇంటికి అరకిలోమీటర్ సమీపంలోనే కానిస్టేబుల్ హైవే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. ఎం.యోహోన్ నాయక్ హైవే పెట్రోలింగ్ మొబైల్ వాహనంలో పని చేస్తుంటారు. జాతీయ రహదారిపై మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి ఇసుక దర్శి ఫ్లైవోవర్ మీదుగా రాజుపాలెం కూడలి వరకు కానిస్టేబుల్ యోహోన్ కారులో పెట్రోలింగ్ చేస్తుంటారు. సోమవారం రాత్రి యథావిధిగా పెట్రోలింగ్ కారులో డ్యూటీకి వెళ్లారు. అతని భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎ వరూ లేక పోవడంతో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వెళ్లి ఇంటి తాళాలను గమనించి వచ్చారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో మరలా కానిస్టేబుల్ ఇంటికి వెళ్లిగా తాళాలు తీసి ఉండడంతో ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో ఉండాల్సిన బంగారు వస్తువులు బ్రాస్‌లెట్, ఉంగరం, జుంకాలు, వెండి పట్టాలు, వెండి చైన్‌తో పాటు రూ.9వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు మార్టూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సైదా, కానిస్టేబుల్ ప్రసాద్ వచ్చి పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఇదిలావుండగా రోజూ ఇంటికి సుమారు 500 మీటర్ల దూరంలో ఒంగోలు వైపు పెట్రోలింగ్ చేస్తూ రోజూ అక్కడే రోడ్డు పక్కనే పోలీసులు కారును పార్కింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో చోరీ జరగడం అటు పోలీసులను, కాలనీవాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. నెలకిందట దొంగతనం జరిగిన ఇంటి నుంచి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న భారత్ గ్యాస్ కార్యాలయంలో అర్ధరాత్రి దొంగతనం చేయడం సీసీ ఫుటేజీలో ఉంది. మళ్లీ ఇదే రోడ్డులో కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిసమయంలో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వీరయ్య

బీసీ, టీఎన్‌టీయూసీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 27 : చినగంజాం గ్రామంలో మార్చి 5న బాపట్ల పార్లమెంట్ స్థాయిలో జరిగే టీడీపీ బీసీ, టీఎన్‌టీయూసీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీర య్య పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మండల బీసీ సం ఘం అధ్యక్షుడు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షతన మంగళవారం జరిగిన బీసీ, టీఎన్‌టీయూసీ నాయకులు, కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలోఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా బీసీ యాదవ సాధికార సమితి కన్వీనర్ నక్కల వీరరాఘవులు, పర్చూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నరహరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు కొండ్రగుంట శ్రీహరి, వీ .వెంకయ్య, ఎన్‌వీ నారాయణ, యార్లగడ్డ లక్ష్మి, అబ్దుల్ కలాంఅజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, దండుప్రోలు తిరుపతిరావు, కే.రామాంజనేయులు, కే.విష్ణు, పిచ్చయ్య, బాలరాజు, షేక్ జిలాని, షేక్ ఖాదర్‌బాషా, కే.రాముడు, పైనం సుబ్బారావు, పిల్లి కృష్ణ, రాజు వెంకటేశ్వరరెడ్డి, టి.చిన్నా, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, జి.నరసింహారావు, గోపాలం, పట్టాభి వెంకటేశ్వర్లు, టీఎన్‌టీయూసీ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలరాజుపై చర్యలు చేపట్టాలి



ఆందోళన చేపట్టిన వేటపాలెం పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 27 : వేటపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి-2 డాక్టర్ బాలరాజు తమను వేధిస్తున్నారని, ఆయనపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీ పరిధిలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఆందోళనకు దిగారు. డాక్టర్ తమను చేతల ద్వారా, మాటల ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. డాక్టర్ బాలరాజుపై గతంలో చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో చేపట్టిన విచారణలో తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ మేరకు కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు వీరికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డుదారులతో మర్యాదగా మాట్లాడాలి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 27 : రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులతో మర్యాదగా మాట్లాడాలి. కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌వో విలియమ్స్ డీలర్లు స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని డీలర్లతో సమీక్ష నిర్వహించారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సంబంధించి స్పందనలో వచ్చే అర్జీలపై చర్యలు తప్పవన్నారు. అవకతవకలకు పాల్పడితే కేవలం 6ఏ కేసులతో సరిపుచ్చమని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోయినా, నల్లబజారుకు తరలించినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కనకనాగవరపమ్మను దర్శించుకున్న నరేంద్రవర్మ

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 27 : కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ టీ డీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకు లు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన డ్రైవర్ల అంత్యక్రియలు

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

బల్లికురవ. ఫిబ్రవరి 27 : కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నక్కబొక్కలపాడుకు చెందిన లారీ డ్రైవర్లు దాసరి ప్రసాద్, దాసరి కిషోర్, బండి నాగయ్య మృతదేహాలు పోస్టుమార్టం అనంతరం మంగళవారం గ్రామానికి చేరాయి. దాసరి ప్రసాద్, దాసరి కిషోర్ మృతదేహాలను రామాంజనేయపురం గ్రామంలోని వారి స్వస్థలా లకు తరలించి అక్కడ వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. బండి నాగయ్య మృతదేహాన్ని నక్కబొక్కలపాడుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బతుకు దెరువుకు లారీ డ్రైవర్లగా వెళ్లి విగత జీవులుగా వచ్చారని బాధిత బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. వీరి మృతదేహాలను చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామాజంనేయపురం, నక్కబొక్కలపాడు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. లారీ టైరు మారుస్తుండగా వారిని బస్సు డీకొట్టటం, అందరూ మృతి చెందడం విధి తలరాత అంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. లారీ డ్రైవర్ల మృతి వార్త తెలిసి పలు వాహనాల డ్రైవర్లు మంగళవారం లారీలకు వెళ్లకుండా సెలవు ప్రకటించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పర్చూరు, ఫిబ్రవరి 27: పర్చూరు నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి కే వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో అధ్యక్షతన గుర్తింపు పొందిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ 22-01-2024 ఫైనల్ పబ్లికేషన్ తదుపరి వచ్చిన క్లైమ్‌లను ఎన్నికల కమీషన్ నిబంధన ప్రకారం మాత్రమే పూర్తిచేయం జరుగుతుందని తెలపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా సిబ్బంది కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం తహసీల్దార్‌లు సీహెచ్.సుబ్బయ్య, ఎం.ప్రమీల, జీవీఎస్ ఫణీంద్రబాబు, రాజకీ య పార్టీల నేతలు శివనాగేశ్వరరావు, షేక్ షంషుద్దీన్, నన్నపనేని రంగయ్య చౌదరి, లంకా శివనాగేశ్వరరావు, అడపాల కృష్ణ పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన

బల్లికురవ. ఫిబ్రవరి 27 : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ సుభద్ర పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులను పరిశీలించి నివేదికలు తయారు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియెగించుకోనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. వృద్ధులకు ర్యాంపులు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయనవెంట సర్వేయర్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి రవుఫ్‌ఖాన్ ఉన్నారు.

గ్రామాలపై నిఘా

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్ఐ నాగశివారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పెరపాలెం, వేమవరం, కోటవారిపాలెం గ్రామాలలో ఎస్ఐ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంటుందన్నారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసకుంటాని హెచ్చరించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024



సర్వం సిద్ధం !

ఎల్లుండి నుంచి ఇంటర్ పరీక్షలు

- 81 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- హై పవర్ కమిటీ ఏర్పాటు
- ఏడు సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- కట్టుదిట్టంగా బందోబస్తు
- ఆర్ఐవో శ్రీనివాసులు వెల్లడి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27 : జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి మార్చి 20 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలోని 54 ప్రైవేట్, 27 ప్రభుత్వ కళాశాలలతో కలిసి మొత్తం 81 కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఆర్ఐవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

● నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఇచ్చిన సమయం కంటే నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 25,202, ఒకేషనల్ 1217 మంది కలిపి 26,419 మంది హాజరవుతున్నారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 24,243, ఒకేషనల్‌కు 1414 మంది కలిపి 25,657 మంది హాజరవుతున్నారన్నారు.

నెల్లూరులోని కేపీసీ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐవో తదితరులు

● అధికారుల నియామకం

ఈ పరీక్షలకు 1200 మంది ఇన్విజిలేటర్లు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, 81 మంది చీఫ్‌లు, 81 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 16 మంది కస్టోడియన్‌లతోపాటు డీఈసీ సభ్యులను నియమించామని ఆర్ఐవో వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సీఎస్‌లు, కస్టోడియన్‌లతో సమావేశం నిర్వహించామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

పరీక్షల నిర్వహణలో ఏదైనా సమాచారం, ఇబ్బందులను తెలియ చేసేందుకు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూములో 0861-2320312 నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష లను పర్యవేక్షించేందుకు ఇంటర్ బోర్డులో పనిచేస్తున్న ఓఎస్‌డీ ఎస్.బహుగుణ, సూపరింటెండెంట్ భాను కిషోర్‌లను జిల్లాకు పరిశీలకులుగా నియమించినట్లు ఆర్ఐవో తెలిపారు. కాగా నగరంలోని వివిధ కళాశాల్లో ఏర్పాటు చేయనున్న పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో తదితరులు పరిశీలించారు.



● అధికారులతో సమన్వయం

పరీక్షల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఆర్ఐవో తెలిపారు. పోలీస్, విద్యావిభాగం, ఎలక్ట్రిసిటీ, ఆర్‌టీసీ, పోస్టల్, హెల్త్, మునిసిపాలిటీ అధికారులతో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. దూర ప్రాంతాల విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేసేలా ఆర్టీసీ అధికారులు అంగీకరించారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

● సెల్‌ఫోన్ నిషేధం

విధులకు హాజరయ్యే అధికారుల సెల్‌ఫోన్‌లను జీపీఎస్ సిస్టమ్ ద్వారా ఇంటర్‌బోర్డు ట్రాకింగ్ చేస్తుందన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్‌లు ఎవరూ కూడా సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్‌లు, అభ్యంతరకర వస్తువులు, కాగితాలను పరీక్ష హాలులోకి తీసుకెళ్లకూడదన్నారు. ఒక్కో కేంద్రానికి నాలుగు చొప్పున అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. హాల్‌టికెట్‌పై కళాశాల స్టాంపింగ్, ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షలకు అనుమతిస్తామని తెలిపారు.

● ఏడు సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో ఏడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో జరిగిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తును కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా పీహెచ్‌సీ విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు

బాబు సభ ఏర్పాట్లపై సమీక్ష

- మార్చి 2న టీడీపీ అధినేత నెల్లూరు రాక
- వీపీఆర్ కన్వెన్షన్ హాలులో సభ
- 'దేశం'లో చేరనున్న వేమిరెడ్డి దంపతులు
- వీపీఆర్ బాటలోనే మరికొందరు...

నెల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్), ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి టీడీపీ చేరిక సందర్భంగా మార్చి 2న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుకు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారయ్యింది. ఈ సందర్భంగా కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో సభ నిర్వహించనున్నారు. 2వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు చంద్రబాబునాయుడు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. చంద్రబాబు రాక, వీపీఆర్ దంపతులతో పాటు ఆయనకు మద్దతుగా భారీ సంఖ్యలో నెల్లూరు నగర వైసీపీ నాయకులు కూడా టీడీపీలో చేరనున్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. చంద్రబాబు పర్యటనలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసే క్రమంలో మంగళవారం వీపీఆర్ కన్వెన్షన్‌లో టీడీపీ ముఖ్య నాయకులు ఏర్పాట్లపై సమీక్షించారు. ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, జనసేన నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లపై సమీక్షించారు. చంద్రబాబు రాక సందర్భంగా భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. వీపీఆర్ వెంట టీడీపీలో చేరడానికి జిల్లావ్యాప్తంగా పలువురు నేతలు సిద్ధమయ్యారు. టీడీపీలో చేరే నాయకులు, వారి అనుచరులతో వీపీఆర్ కన్వెన్షన్ హాలు కిక్కిరిసిపోనున్నది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వీపీఆర్ తన సిబ్బందికి సూచించారు.



గీతాంజలిలో ఏర్పాటైన సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో తదితరులు

టెట్ ప్రారంభం

- తొలిరోజు 385 మంది హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మంగళవారం ప్రారంభమైంది. మార్చి 6వతేదీ జరిగే ఈ పరీక్షకు జిల్లాలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు డివిజన్‌కు ముత్తుకూరురోడ్డులోని గీతాంజలి పీజీ కళాశాల, జొన్నవాడ-నరసింహకొండ రోడ్డులోని ఇయాన్ డిజిటల్ జోన్‌ను, కావలి డివిజన్‌కు ఉదయగిరి రోడ్డులోని వీబీఆర్ విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 6,363 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో 471 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 385 మంది హాజరయ్యారు. 86 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష నిర్వహణ తీరును డీఈవో పీవీజే.రామారావు, జిల్లా అబ్జర్వర్ డీ మధు సూదన్‌రావులు పర్యవేక్షించారు.

కందుకూరు బరిలో
బుర్రా మధుసూదన్

- వైసీపీ అభ్యర్థిగా ఖరారు ?
- సీఎంను కలిసిన వంకి పెంచలయ్య
- ఫలించని ప్రయత్నాలు

కందుకూరు, ఫిబ్రవరి 27: కందుకూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ఆపార్టీకి చెందిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. కందుకూరు ఇన్‌చార్జిగా వంకి పెంచలయ్య కుమార్తె కఠారి అరవిందను పార్టీ అధిష్ఠానం నియమించగా, ఆమె నేటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో రెండురోజులుగా మధుసూదన్‌తాడేపల్లిలోనే మకాం వేసి కందుకూరు ఇన్‌చార్జి పదవి కోసం తనవంతుగా ప్రయత్నాలు చేశారు. కనిగిరి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బుర్రాకు అక్కడ తిరిగి అవకాశం ఇచ్చేందుకు నిరాకరించిన జగన్ నెల క్రితమే కందుకూరు వెళ్లాలని ఆదేశించారు. అయితే అప్పట్లో ఇక్కడ పోటీచేసేందుకు బుర్రా విముఖత చూపటంతో జగన్ కఠారి అరవిందను ఇన్‌చార్జిగా నియమించారు. అనంతర పరిణామాలతో అరవింద పోటీకి సిద్ధపడకపోవటంతో బుర్రా పేరును పరిశీలనలోకి తీసుకుని ఖరారుచేసినట్లు విశ్వసనీయ సమాచారం.



బుర్రా మధుసూదన్ యాదవ్

● పోటీకి సిద్ధం : వంకి

కాగా మంగళవారం వంకి పెంచలయ్య కూడా తాడేపల్లికి వెళ్లి తన కుమార్తె పోటీచేయటానికి ఇబ్బందులు ఉన్నాయని, ఆమె స్థానంలో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. అరవింద పోటీకి సిద్ధపడితే ఇప్పటికైనా వెళ్లి పనిచేసుకోవాలని, లేకుంటే లేదని జగన్ తేల్చి చెప్పగా అందుకు పెంచలయ్య విముఖత తెలిపినట్లు తెలిసింది. ఈ క్రమంలో కందుకూరు ఇన్‌చార్జిగా బుర్రాను ఖరారు చేసినట్లు తెలిసింది. మార్చి 3న మేదరమిట్ల సమీపంలో జరిగే సిద్ధం బహిరంగ సభకు కందుకూరులో ఏర్పాట్ల బాధ్యతలు చూడాల్సి ఉన్నందున బుధవారం బుర్రా పేరును అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉందని వైసీపీ ముఖ్యనేతలు పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న యువసేన నాయకులు



నెల్లూరుకి మంచినీళ్లిచ్చారా ?

- ఐదేళ్లలో వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు పూర్తిచేశారా?
- వైసీపీ ప్రభుత్వంపై నారాయణ యువసేన మండిపాటు
- నెల్లూరు టూ సంగం కార్యక్రమానికి భారీగా కార్యకర్తలు
- ప్లాంట్ గేటు మూసి ఉండడంతో నిరసన

పొదలకూరు, ఫిబ్రవరి 27: నెల్లూరు నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గత టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న డాక్టర్ పొంగూరు నారాయణ పొదలకూరు మండలం మహమ్మదాపురం తిప్ప వాటర్ ప్లాంట్ ప్రాజెక్టును మంజూరు చేయించారు. అయితే ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం దాన్ని పట్టించు కోలేదంటూ మంగళవారం నారాయణ యువసేన నెల్లూరు టూ సంగం కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మహమ్మదాపురం తిప్ప వద్ద ఆందోళన చేపట్టారు. సేకరించిన వివరాల మేరకు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నారాయణ యువసేన నాయకులు కృష్ణయాదవ్, యశ్వంత్‌రెడ్డి, లెకిన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, అమర్, నాని, ముస్తక్, హేమంత్, మున్నా, శివారెడ్డి, మిత్రబృందం ఆధ్వర్యంలో భారీగా సంగం బ్యారేజీ మీదుగా వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. 50 టెంపోలలో సుమారు వేయిమంది వరకు తరలివచ్చారు. అయితే వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్ద గేట్లు మూసేసి ఉండడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో యువసేన నేతలు వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్ద వేచి చూశారు. పోలీసులను నెట్టుకుని ప్రాజెక్టులోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఎంతసేపటికి అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టారు. తాము వస్తామని తెలిసి అధికారులు ప్రాజెక్టు గేట్లు మూసివేయడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. మహమ్మదాపురం వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు నుంచి నెల్లూరు వరకు చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో 84 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన 16 శాతం పనులను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని మండిపడ్డారు. దీంతో నెల్లూరు నగర ప్రజలకు తాగడానికి మంచినీరు కరువయిందన్నారు. కలుషితనీరు తాగి నగర ప్రజలు అవస్థలు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. ఈ నాలుగున్నరేళ్లలో నగరవాసులకు మౌలిక సదుపాయాలను కూడా అందించలేద న్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని రోజుకొకటి లెక్కన చూపిస్తామని, వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి ఒక్కటుంటే ఒక్కటి చూపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డితో పాటు నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 28డివిజన్లకు చెందిన నారాయణ యువసేన నేతలు, కార్యకర్తలు, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను నెట్టుకుని వాటర్ ప్లాంట్ ప్రాజెక్టులోకి వెళుతున్న నారాయణ యువసేన కార్యకర్తలు

నిరుద్యోగులతో ఆటలు

- ఆర్అండ్‌బీ అతిథిగృహాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టుల మంజూరు
- 27 ఖాళీలకు 841 మంది దరఖాస్తు
- జీతాలు మాత్రం గెస్ట్‌హౌస్‌ల నుంచే ఇవ్వాలట !
- నిర్వహణకే కష్టమైతే వేతనాలు ఎలా ?

నెల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె.. అన్నట్లుగా ఉంది. రహదారులు, భవనాల(ఆర్అండ్‌బీ) శాఖ అతిథిగృహాల్లో ఉద్యోగాల భర్తీ. గెస్ట్‌హౌస్‌ల నిర్వహణకే డబ్బుల్లేక అధికారులు నానా తంటాలు పడుతుంటే, ఇప్పుడు అక్కడ నియమిస్తున్న ఉద్యోగులకు కూడా ఆ గెస్ట్‌హౌస్‌ల నుంచే వస్తున్న ఆదాయాన్ని జీతాల రూపంలో చెల్లించాలట. ఇవి ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు. జిల్లాలోని తొమ్మిది ఆర్అండ్‌బీ అతిథిగృహాల్లో అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ ఉద్యోగులకు జీతాల దగ్గరే అసలు సమస్య తలెత్తి తుంది. తొమ్మిది గెస్ట్ హౌస్‌ల్లో తొమ్మిదేసి మంది అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులకు ఆర్అండ్‌బీ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. అటెండర్ పోస్టులకు 593, వాచ్‌మన్ పోస్టులకు 147, స్వీపర్ పోస్టులకు 101 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తంగా 27 పోస్టులకు 841 దరఖాస్తులు అందా యి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ఎనిమిది మంది జిల్లా అధికారుల కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది. మార్చి నుంచి ఎంపికయినవారు పనిచేయాల్సి ఉంటుంది.

● తక్కువమందే అద్దెలకు...

ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు, ఇతర రంగాల ప్రముఖులు వినియోగించుకుంటుంటారు. ఇందుకుగానూ ప్రభుత్వం నిర్దేశించిన అద్దె చెల్లించాలి. అయితే ప్రస్తుతం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లను అద్దెకు తీసుకునే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. ఒక్క నెల్లూరు మినహా మిగిలిన చోట్ల నెలకు రెండు, మూడు రోజులు కూడా అద్దెకు తీసుకునే పరిస్థితిలేదు. నెల్లూరులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ కూడా ఆర్అండ్‌బీ చేతుల్లో కాకుండా కలెక్టరేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కొన్నేళ్ల నుంచి అందులో బుకింగ్ అంతా కలెక్టరేట్ నుంచే జరుగుతున్నాయి. ఎవరు వస్తున్నారు..? ఎంత అద్దె వస్తోంది..? అన్న విషయాలేవీ ఆర్అండ్‌బీ అధికారులకు తెలియడం లేదు. కానీ నిర్వహణ మాత్రం ఆర్అండ్‌బీనే చేస్తోంది. ఇలా ఏటా ఒక్కో గెస్ట్‌హౌస్ నిర్వహణకు రూ.లక్షల్లోనే ఖర్చవుతోంది. ఈ ఖర్చుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి రాక ఆర్అండ్‌బీ అధికారులే నానా తంటాలు పడుతున్నారు.

● జీతాలు ఎలా చెల్లిస్తారు..?

ఇప్పుడు కొత్తగా నియమితులవుతున్నవారికి గెస్ట్‌హౌస్‌లకు అద్దెరూపంలో వచ్చే నగదు నుంచే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం నిరుద్యోగులతో ఆటలాడుకోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చెల్లించినా, నెలకు రూ.45 వేలు అవసరం. అలానే విద్యుత్ బిల్లులు, రిజిస్టర్‌లు, కార్యాలయ నిర్వహణకు మరో రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుందని ఆర్అండ్‌బీ వర్గాలు చెబుతు న్నాయి. ఇలా మొత్తంగా చూసుకున్నా ఒక గెస్ట్‌హౌస్ నిర్వహణకు నెలకు సుమారు రూ.70 వేల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఏ గెస్ట్‌హౌస్‌లో కూడా అంత మొత్తం అద్దె రూపంలో రావడం లేదు. మరి కొత్తగా చేరే ఉద్యోగులకు జీతాలు ఎలా చెల్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. 27 పోస్టులకు 841 మంది దరఖాస్తు చేసుకున్నారంటేనే నిరుద్యోగ సమస్య ఎలా ఉందో అర్థమవుతోంది. అలాంటిది ఉద్యోగంలో చేరాక సకాలంలో జీతాలు చెల్లించలేకపోతే ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల పరిస్థితేమిటన్న వాదన వినిపిస్తోంది.



2.20 లక్షల మంది రైతులకు
రూ.45.28 కోట్లు

- నేడు పీఎం కిసాన్, రైతు భరోసా నిధుల విడుదల
- సున్నా వడ్డీ నగదు కూడా ఖాతాల్లోకి..

నెల్లూరు(వ్యవసాయం): పీఎం కిసాన్, వైఎస్ఆర్ రైతు భరోసా పథకాల కింద పెట్టుబడి సాయంగా మూడో విడత నిధులు విడుదల బుధవారం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2,20,749 మంది రైతుల ఖాతాల్లో రూ.45.28కోట్ల నిధులు జమ అవుతా యని ఆమె పేర్కొన్నారు. అలాగే 2021-22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్లలో రూ.లక్షలోపు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ నిధులు కూడా జమ అవుతాయని వివరించారు. 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి 14,483 మంది రైతులకు రూ.3.7కోట్లు, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 3148 మంది రైతులకు రూ.81.66లక్షలు అన్నదాతల ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రైలు ప్రయాణికులకు తీపికబురు

- ప్యాసింజర్, మెమూ ట్రైన్ల చార్జీల తగ్గింపు
- రూ.10 చార్జీ పునరుద్ధరణ
- జిల్లాలో వేలాదిమందికి ఊరట

నెల్లూరు (వెంకటేశ్వరపురం): సాధారణ రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ప్యాసింజర్,మెమూ రైళ్లలో చార్జీలను తగ్గించింది. ఈ మేరకు రైల్వేశాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2020కు ముందు నెల్లూరు నుంచి గూడురుకు ప్యాసింజర్ రైలులో రూ.10 టికెట్ ఉండేది. అయితే 2020 తరువాత కరోనా సమయంలో అన్ని ప్యాసింజర్, మెమూ రైళ్లలో ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలను ఖరారు చేశారు. దీంతో గూడురుకు రూ.10 ఉన్న టికెట్ ధర రూ.30లకు పెరిగింది. అలాగే అన్ని ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరలను కూడా పెంచారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం టికెట్ ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రయాణికులకు ఎంతో ఊరట కలిగింది. దీంతో నెల్లూరు మీదుగా రాక పోకలు సాగించే 12 ప్యాసింజర్,మెమూ రైళ్లలో టికెట్ ధరలు తగ్గనున్నట్లు రైల్వే కమర్షియల్ మేనేజర్ వంశీ తెలిపారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



పల్స్ పోలియో శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ స్వప్న

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27: వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్, ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పీలు, పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చారు. మండలాన్ని రెండు రూట్లుగా విభజించి 18 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశా మన్నారు. మొత్తం 1,597 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంగయ్య, సీడీపీవో పచ్చవ లావణ్య, సీహెచ్‌వో ఓంకా రయ్య, ఆరోగ్య సిబ్బంది ఖాజామొహిద్దీన్, అరుణకుమారి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమంపై ఉపాధ్యాయులు, ఆశా, హెల్త్ స్టాఫ్, వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. మండలంలో 0-5 సం వత్సరాల పిల్లలు 1,932 మంది ఉండగా వారికోసం గ్రామాల వారీగా 38 బూత్‌లు, బస్టాండ్ నందు ఒక బూతు, మొబైల్ బూతు ఒకటి ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈవో మస్తాన్‌వలి, మజీద్, రియాజ్, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఆగని విద్యుత్ చోరీలు

చేజర్ల, ఫిబ్రవరి 27: మాముడూరు సమీపంలోని ఫ్యాక్టరీ కోసం ఆదురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 15కిలో మీటర్లు 33 కేవీ లైన్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట ఫ్యాక్టరీ మూసివేయడంతో ఆ లైన్‌కు కరెంట్ సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న దొంగలముఠా వైర్లు దొంగలించే పనిలో నిమగ్నమయ్యారు. వాహనాలలో రావడం స్తంబాలను పగలకొట్టడం.. 33కేవీ లైనుకు సంబంధించిన వైరును తీసుకెళ్లడం ఇదే తంతుగా మారింది. చోరీలను తెలుసుకున్న విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ మన్మదరావు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. గతంలో జరిగిన నాలుగు చోరీలపై చేజర్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.



స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

చోరీల సయయంలో పంటలు ధ్వంసం..

విద్యుత్ స్తంభాల లైన్లు పొలాల్లో ఉండడంతో దొంగలు పంటలను కూడా ఇష్టానుసారంగా తొక్కిస్తూ రైతులకు తీవ్రనష్టం కలిగిస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చిన సయమంలో ఇలా జరుగుతండంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా జరుగుతన్న చోరీలపై అధికారులెవరూ నోరు మెదపడంలేదు. కాలువలు, నదుల వెంబడి ఉండే స్టాటర్లు, మోటార్లు, వైర్లు, రోడ్డుకు లోపల తోటల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రినే టార్గెట్‌గా దోపిడీ చేస్తూ దొంగలు పోలీసులకు సవాళు విసురుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అంజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: మున్సిపాల్టీ పరిధిలోని సమస్యలను పరిష్కరించే దిశగా సత్వర చర్యలు చేపట్టాలని మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సంధాని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికై సీపీఎం పార్టీ ఎల్ఆర్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో మంగళవవారం కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్‌ఆర్‌పల్లి నుంచి చావిడి సెంటర్, రామాలయం వీధి వరకు మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మాసుం డ్రైనేజీ కాలువ మరమ్మతులకు నోచుకోక పోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువను శుభ్రపరిచి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఎస్ఎంటీ పార్కులో ముళ్లపొదలను తొలిగించి పార్కును వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు శ్రీహరి, కృష్ణమోహన్, కాలేషా పాల్గొన్నారు.

కాకర్ల విజయానికి కృషి

వరికుంటపాడు, ఫిబ్రవరి 27: నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని యువ నాయకుడు పేరం సుధాకరరెడ్డి కోరారు. మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే నిస్వార్థ సేవా గుణం కలిగిన కాకర్లను గెలిపిస్తే భవిష్యత్తులో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు.

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న దంపతులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27: నందిపాడు సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పోతిగుంట శ్రీలక్ష్మి వెంకటరత్నం ఛారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో 41 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయాన్ని నిర్మించారు. తొలిరోజు వేదపండితులు గంగానయనం, గణపతి, పుణ్యాహవచనం, పంచగవ్య, రక్షాబంధనం, మాతృక, మంగళ పూజ కార్యక్రమాలతోపాటు అభిషేకాలు, అర్చనలు చేశారు. 28న కాల పూజ, హోమాలు, గ్రామోత్సవం, 29న శిఖర, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

20వ వార్డులో కమిషనర్ పర్యటన

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: స్థానిక 20వ వార్డులో మంగళవారం మున్సిపల్ కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి వార్డు పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్ఐ షేక్ ఖాసీం, మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కోసం బతిమలాడాల్సిన దుస్థితి

● అధికారులపై బీజేపీ మండల నాయకుల ఆగ్రహం



అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

చేజర్ల, ఫిబ్రవరి 27: సోమశిల దక్షిణ కాలువ నుంచి వచ్చే నీటిని కోసం మండల రైతులు బతిమలాడాల్సిన దుస్థితి ఏర్పడిందని బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి అంజనేయరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు, స్థానిక రైతులతో కలసి సోమశిల దక్షిణ కాలువ 24ఎల్ షట్టర్ వద్ద నీటి ప్రవాహాన్ని పరి శీలించారు. గొల్లపల్లి, పాడేరు చెరువులు కింద రెండు వందల ఎకరాలపైగా వరి పంటసాగు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం చెరువులో నీరు ఉన్నందునే వలనే నీరు వదలేదని అధికారులు చెప్పడం విచారకరం అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యకు పరి ష్కారిస్తామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఆడిట్ అధికారి హరివర్మ

ఉదయగిరి, ఫిబ్రవరి 27: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డులను మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ మార్కెటింగ్ ఆడిట్ అధికారి హరివర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో జరిగిన క్రయవిక్రయాలపై తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ విజయరాణి బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందన్నారు. క్రయవిక్రయాలపై సిబ్బంది తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను తెలియజేశారు.

మరమ్మతులకు నోచని చేతిపంపు



హెడ్ ఊడిపోయి కిందకు వాలిపోయిన చేతిపంపు

సంగం, ఫిబ్రవరి 27: ఈ చిత్రంలో కనిపించే చేతిపంపు మర్రిపాడు గిరిజన కాలనీలోనిది. 70గిరిజన కుటుంబాలుండే చోట ఉన్నది ఒకే చేతిపంపు. ఏడాదిపైపే చేతిపంపు చెడిపోయినా మరమ్మతుకు నోచుకో లేదు. ఇంటింటికీ కుళాయి వేసినా జలజీవన్ మిషన్ మోటార్లు పాడవడంతో రోజంతా నీటి సరఫరా కాలేదు. ఇలాంటి సమయంలో చేతిపంపు ఉంటే నీటి సమస్య తలెత్తదని స్థానికులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ తదితర ప్రాంతాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు లు ఏర్పాటు చేసి ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వ్యాపార దుకాణాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కావలి, ఫిబ్రవరి 27 : వ్యాపార సంస్థల యజమానులు తమ సంస్థలు, దుకాణాలను ఈ నెల 29 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కావలి సహాయ కార్మిక అధికారి ఎన్.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

● రూ.1.20 లక్షల రికవరీకి ఆదేశం





సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు, ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 27 : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. ఎంపీటీసీలు, సర్పంచులు తదితర ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కాలేదు. 2022-23లో 21 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో జరిగిన అవకవతకలకు సంబంధించి రూ.1.20 లక్షల రికవరీకి అధికారులు ఆదేశించారు. కూలీలకు నగదు చెల్లించి మస్టర్లలో వేలి ముద్రలు, సంతకాలు లేకపోవడం, ఒకరి పేరుపై మరొకరు పనులకు హాజరుకావడం, రికార్డుల ప్రకారం నాటిన మొక్కలు లేకపోవడం, పని ప్రదేశాలలో నేమ్‌బోర్డులు పెట్టకుండానే బిల్లులు తీసుకోవడం, మస్టర్లు, రికార్డులలో వివరాలు సరిగా లేకపోవడం గుర్తించామని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. అలాగే పలు గ్రామాల్లో పనుల కొలతల్లో చిన్నచిన్న వ్యత్యాసాలు, నిర్దేశించిన రోజులకంటే ఎక్కువ రోజులు కూలి చెల్లించినట్లు తెలిపారు. రికార్డుల ప్రకారం జామ, నిమ్మ మొక్కలు క్షేత్రస్థాయిలో లేవని తెలిపారు. ఈ అక్రమాలలో రూ.1,20,000 రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌క్యూసీ వేణు, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపీపీ పొనుగోటి మౌనిక, ఎస్‌టీఎమ్ సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ బుజ్జి, ఎంపీడీవో రఫీక్ అహ్మద్, ఏపీవో ఉమామహేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు



సభలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 27: బీసీలకు గుర్తింపు తీసుకువచ్చిన పార్టీ తెలుగుదేశం అని పలువురు బీసీ నేతలు చెప్పారు. కావలి టీడీపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం పట్టణ, రూరల్ మండలాలకు సంబంధించి జయహో బీసీ సభ జరిగింది. పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా టీడీపీ ప్రాధాన్యం కల్పిస్తే ఆ తర్వాత అనేక పార్టీలు ఓట్ల కోసం బీసీల జపం చేస్తున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని పాదయాత్రలో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను అణగదొక్కారన్నారు. బీసీల రిజర్వేషన్‌ను 34 నుంచి 24 శాతంకు తగ్గించి 16,800 మందిని రాజకీయ పదవులకు దూరం చేశారన్నారు. బీసీల బతుకులు మారాలంటే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 50 శాతం పదవులు బీసీలకు కేటాయిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా బీసీ నేతలు చెంచలబాబు యాదవ్, కొండూరు పాలిశెట్టి, పీఎల్‌రావు, కప్పిర శ్రీనివాసులు, పోట్లూరు శ్రీనివాసులు, గంజం రాగవేంద్ర, రవీంద్ర బాబు, ఉప్పు భాస్కర్, కంచర్ల ఘనేంద్ర, షేక్ సుభాన్, బుడుగు వెంకయ్య, ఆవుల రామకృష్ణ, బాలగురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ



మహిళతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ సాధ్యమని, రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో తొలి అడుగు అటువైపే పడుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జనార్థన కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి టీడీపీ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

క్రీడాకారులతో వైసీపీ బంతాట : రాష్ట్రంలో అధికార వైసీపీ నేతలు క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఒక వైసీపీ నేత కుమారుడిని మందలించాడన్న కారణంతో రాష్ట్ర రంజీ కెప్టెన్‌గా వ్యవహరించిన హనుమ విహారిని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించడం చూస్తుంటే రాష్ట్రంలో వైసీపీ నేతల దందా ఏస్థాయిలో ఉందో అర్థమవుతున్నదన్నారు. హనుమవిహారికి మంత్రి రోజా వెంటనే క్షమాపణలు చెప్పి అతనికి తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2వ వార్డులో వైద్యశిబిరం : ఒంగోలులోని చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో కాలనీవాసులకు వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. క్యాంప్ నిర్వాహకులు వైఎల్ నారాయణ, సహజానందం, సిబ్బందిని నాగేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నార్నె రోశయ్య, కూనం నరేంద్ర, పొడపాటి మహేష్ పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలిసిన ఇంటూరి రాజేష్



వేమిరెడ్డిని కలిసిన రాజేష్

కందుకూరు, ఫిబ్రవరి 27: వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. పలువురు స ర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీపీలు, అధికసంఖ్య లో నాయకులు, కార్యకర్తలను వెంట తీసుకెళ్లి వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజేష్‌తో చర్చించినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సోదరుడు దివి రమేష్‌తోనూ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పులివర్తి బసవయ్యనాయుడు, పొడపాటి శ్రీను, ఆవుల నరసింహారా వు, పొడపాటి వంశీ, అమ్మనబ్రోలు రమేష్, ఎం శ్రీహరి, మానం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశ చరిత్ర యువతకు స్ఫూర్తి కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్‌శంకర్

కావలిటౌన్, ఫిబ్రవరి 27: భారతదేశ చరిత్ర యువతకు స్ఫూర్తి కావాలని ఆంధ్రకేశరి యూనివర్శిటీ (ఒంగోలు) రిజిస్ట్రార్ బీ హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వీఎస్‌యు పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన యు వసంవాద్ ఇండియా 2047 అనే కార్యక్రమంపై జరిగిన సదస్సులో ప్రత్యేక అతిధులుగా హరిబాబుతో పాటు పీలేరు ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ప్రెఫెసర్ వెంకటరమణయ్య, నెల్లూరు యువకేంద్ర జిల్లా కన్వీనర్ మహేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ పాల్గొని మాట్లాడారు.

డీఎస్పీ వసతి గృహం పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

బిట్రగుంట, ఫిబ్రవరి 27: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కావలి డీఎస్పీ వెంకటరమణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. బాలుర వసతి గృహంలోని వసతుల విషయం వార్డెన్ అనితను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏప్రిల్ నెలలో జరుగు సార్వత్రిక ఎన్నికల నిర్వాహణ భద్రత విషయమై ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అదనపు పోలీసు బలగాల వసతి ఏర్పాటుకై పరిశీలిస్తునట్లు తెలిపారు. ఆయన వెంట కావలి రూరల్ సీఐ నాగభూషణం, స్థానిక ఎస్సై శేఖర్‌బాబు ఉన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



బహుమతులు అందజేస్తున్న మహేంద్రరెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 27 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో మంగళవారం రామకృష్ణా విద్యాసంస్థల క్రీడా మైదానంలో బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహించారు. బాలురకు వాలీబాల్, బాలికలకు ఖోఖో క్రీడలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కె.మురళీమోహన్‌రాజు, రవి, పీడీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ హరి, ఎస్.వి.సత్యనారాయణ, బోయిన వినయ్ పాల్గొన్నారు.

నేడు అల్లూరు మండల సమావేశం

అల్లూరు, ఫిబ్రవరి 27 : మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశలో సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 27 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో వీఆర్ కోట మన్నేరులో సోమవారం అర్ధరాత్రి దాడులు చేసి ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను, ముగ్గురు డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రేపు రాజగోపురం కలశ ప్రతిష్ఠ

కందుకూరు, ఫిబ్రవరి 27: పట్టణంలోని స్కంధపురి జనార్దనస్వామి ఆలయంలో ఈనెల 29న రాజగోపుర కలశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కార్య నిర్వాహకాధికారి భైరాగిచౌదరి, ఆలయ ఛైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందంలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ టీటీడీ వేదపండితులు వేదాంతం విష్ణుభట్టాచార్యులు, శ్రీధర్‌స్వామిలు నేతృత్వంలో వేకువజాము నుంచి కార్యక్రమాలు ప్రారంభమై ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణం, వీధి ఉత్సవం, ధ్వజారోహణ జరుగుతుందని తెలిపారు.

ఇండిపెండెంట్‌గా పసుపులేటి పోటీ

కావలిటౌన్, ఫిబ్రవరి 27: కావలి నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధిపతి పసుపులేటి సుధాకర్ పోటీ చేస్తారని ఆయన సోదరుడు పసుపులేటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గాయత్రినగర్ ట్రంకురోడ్డులోని పసుపులేటి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక స్టేడియం మైదనంలో ఇటీవల జరిగిన పసుపులేటి బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు హాజరవడం పసుపులేటిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని నినదించడం ఆయన చేసిన సేవా కార్యక్రమాలవల్లేనన్నారు. పసుపులేటి అనుచరులు రాంబాబు, మైనంపాటి జగదీష్, శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ పసుపులేటి పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా రూ.కోట్ల సొంత నిధులతో పల్లెలో సేవా కార్యక్రమాలు చేశారన్నారు.

దక్షిణ ముఖ ఆంజనేయుడికి ఆకు పూజ

బిట్రగుంట, ఫిబ్రవరి 27: బోగోలు చెన్నకేశవస్వామి ఆలయంలో దక్షిణ ముఖ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక ఆకుపూజ జరిగింది. మానికల సుబ్బరామయ్య-లలితమ్మ, సురేష్-లక్ష్మీఐశ్వర్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రాచీన ఆలయ జీర్ణోద్ధరణ నూతన ట్రస్టీగా బచ్చు కృష్ణకుమార్‌ను దేవాదయ శాఖ నియమించింది. ట్రస్టీల సూచనల మేరకు స్వామివారికి మొదటిసారి ఆకుపూజలు నిర్వహించారు.

టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

కావలి, ఫిబ్రవరి 27: రెడీమేడ్ దుస్తులు రాకతో టైలర్స్‌కు జీవన భృతి కష్టంగా మారినందున టైలర్స్ సమస్యలు పరిష్కరించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కావలి టైలర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, ఉపాధ్యక్షుడు మాల్యాద్రి, కోశాధికారి వేణు, సంయుక్త కార్యదర్శి ఆలా శ్రీనాథ్‌లు మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తులు వచ్చిన తర్వాత టైలర్స్ వ్యవస్థే దెబ్బతిందన్నారు. 45 ఏళ్లు దాటిన టైలర్ల పించన్ సదుపాయం కల్పించాలన్నారు. కావలిలో టైలర్స్ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు.

టైలర్స్ డేను విజయవంతం చేయాలి : టైలర్స్‌డే సందర్భంగా బుధవారం కావలిలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏవీఎస్ కల్యాణ మండపం వరకు జరిగే ర్యాలీ, ఆ తర్వాత జరిగే సభలో పట్టణంలోని టైలర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు మాలకొండారెడ్డి, రెహమాన్, శ్రీహరి, అల్తాప్, జమీర్, రసూల్, నారాయణరెడ్డి, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చర్యలపై హర్షం

లింగసముద్రం, ఫిబ్రవరి 27 : పార్టీ ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేయడం అభినందనీయమని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయంపుల నిరోధక చట్టాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు.

ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

కావలిటౌన్, ఫిబ్రవరి 27: ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవంను పురస్కరించుకుని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో మంగళవారం రత్నమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. ప్రసాదరావు తన సతీమణి దివంగత రత్నమ్మ పేరిట ఫౌండేషన్ ప్రారంభించి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, అజిత్‌బాబు, జీ.సురేంద్ర, పాల్గొన్నారు.